

## బాధ్యతలు చేపట్టిన డీఈఓ


బాధ్యతలు స్వీకరిస్తున్న డీఈఓ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 10: జిల్లా విద్యాశాఖ అధికారిగా వరలక్ష్మి శనివారం బాధ్యతలు స్వీకరించారు. డీఈఓ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆమెకు కార్యాలయ అధికారులు, సిబ్బంది, సమగ్రశిక్ష అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. యూటీఎఫ్, ఎస్సీ ఎస్టీ, ఎంఈఓ, హెచ్‌ఎం అసోసియేషన్ నాయకులు, ఎంటీఎస్ 98 టీచర్స్ అసోసియేషన్ నాయకులు డీఈఓను కలిశారు. అనంతరం కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌ను కలెక్టరేట్‌లో డీఈఓ మర్యాదపూర్వకంగా కలిశారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జస్టిస్ అమానుల్లా దంపతులు

సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమానుల్లా జేఎన్‌టీయూలో యువ న్యాయవాదుల వర్క్‌షాప్

హాజరైన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ భట్టి, జస్టిస్ మిశ్రా

## అంకితభావమే విజయ రహస్యం

వివరాలు 5లో...



భార్యాబిడ్డలను హత్యచేసిన రామకృష్ణ

## రైలు కింద పడి ఆత్మహత్య

వివరాలు 5లో..

## శంఖారావంతో వైసీపీలో వణుకు

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు



మీడియాతో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

అనంతపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ పూరించిన శంఖారావంతో వైసీపీలో వణుకు పుడుతోందని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నారా లోకేశ్ యువగళం పాదయాత్ర సమకాలీన రాజకీయ ఉద్యమాల్లో సరికొత్త అధ్యాయమన్నారు. యువగళం ఆరంభం నుంచి సీఎం జగన్ ఎన్ని ఇబ్బందులు పెట్టినా అదరకుండా, బెదరకుండా పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేశారని గుర్తు చేశారు. పాదయాత్ర తర్వాత ప్రజలతో మమేకం అయ్యేందుకు శంఖారావం పేరుతో నారాలోకేశ్ ప్రజల్లోకి వస్తున్నారన్నారు. దశాబ్దకాలంగా ఆయన రాజకీయాల్లో రాణిస్తున్నారన్నారు. రాష్ట్ర మంత్రి హోదాలో కేంద్ర ప్రభుత్వం నుంచి అనేక అవార్డులు తీసుకున్న ఘనత లోకేశ్‌కు దక్కుతుందన్నారు. ఐటీ, పంచాయతీరాజ్ లాంటి భిన్నమైన రెండు శాఖలను సమర్థవంతంగా నిర్వహించిన నాయకుడు నారాలోకేశ్ అన్నారు. శంఖారావం జగన్‌కు నిద్రలేని రాత్రులను మిగల్చనుందన్నారు. శంఖారావంలో ప్రజలను, కార్యకర్తలను కలుసుకోవడం ద్వారా టీడీపీ మరింత బలోపేతం అయ్యేందుకు దోహద పడుతుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పార్టీ శ్రేణులు, ప్రజలను కోరారు. చంద్రబాబు చల్లని పాలన కోసం టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ఆ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజే నాగరాజు పాల్గొన్నారు.

## వైసీపీ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయ్

120 నియోజకవర్గాల్లో పర్యటించనున్న నారా లోకేశ్

మాజీ మంత్రి పరిటాల సునీత


మాట్లాడుతున్న మాజీ మంత్రి పరిటాల సునీత

రామగిరి, ఫిబ్రవరి 10: టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారాలోకేశ్ శంఖారావంతో వైసీపీ నాయకుల గుండెల్లో వణుకు ప్రారంభమయ్యిందని మాజీ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. శనివారం ఆమె వెంకటాపురంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు...ఎన్నికల శంఖారావం పేరుతో లోకేశ్ మరో యాత్రకు శ్రీకారం చుట్టడంతో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం, వైసీపీ గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. యువగళం పాదయాత్రతో లోకేశ్ అన్ని వర్గాల ప్రజల్లో ధైర్యం నింపారన్నారు. ఎన్నో అడ్డంకులు సృష్టించినా ఆయన వెనక్కి తగ్గలేదన్నారు. శంఖారావంతో ప్రజల్లోకి వెళ్లి జగన్‌రెడ్డి ప్రభుత్వ దౌర్జన్యాలను, టీడీపీ మేనిఫెస్టోను కార్యకర్తలకు, ప్రజలకు తెలియజేసి చైతన్యం తీసుకురానున్నారన్నారు. 40-50 రోజుల్లో 120 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆయన పర్యటిస్తారని, పాదయాత్రకు వచ్చిన స్పందనే శంఖారావానికి కూడా ఉంటుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాల్లో బాధితులుగా ఉన్నారని, ఈ ప్రభుత్వాన్ని ఎప్పుడెప్పుడు ఇంటికి పంపుదామని ఎదురుచూస్తున్నారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్దిరంగయ్య, సీకేపల్లి టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, నాయకులు కిష్టప్ప , సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

# కుమ్మక్కు

కొందరు కార్పొరేటర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారుల దందా

- నగరంలో ఇష్టారాజ్యంగా అక్రమ కట్టడాలు
- ఒక్కో భవనం నుంచి కనీసం రూ.3లక్షలు
- బెటర్‌మెంట్, ఇంపాక్ట్ ఫీజులకు ఎగనామం
- కొత్త కమిషనర్ దృష్టి సారించేరా..?




అనంతపురం క్రైం: జిల్లా కేంద్రంలో అక్రమ కట్టడాలు అడ్డదిడ్డంగా వెలుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పెద్ద పెద్ద భవనాలు కట్టేస్తున్నారు. ముడుపులు ముట్టజెబితే చాలు..! నగరపాలిక టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ భవనం వైపే చూడటం లేదు. ఈ క్రమంలో అధికార వైసీపీ కార్పొరేటర్లు ఆ అక్రమ భవనాల యజమానుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ విషయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు, కార్పొరేటర్లు కుమ్మక్కయ్యారనే విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా నగరంలో ఇదే వ్యవహారం నడుస్తోంది. చాలా కాలం తరువాత నగర కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి మేఘస్వరూప్ వచ్చారు. ఈయన అయిన అక్రమ భవన నిర్మాణాలు, అధికారులు ఆమ్యామ్యాలు, కార్పొరేటర్ల సహకారంపై దృష్టి సారిస్తారా? అనేది చర్చనీయాంశంగా మారింది.

### ఆ ఇద్దరూ అలా పంచుకున్నారు...


ఉమానగర్‌లో ఓ బిల్డింగ్ కోసం తవ్విన సెల్లార్

నగరంలోని ఉమానగర్‌లో ఓ బిల్డింగ్‌కు సంబంధించి ఇద్దరికి లెక్కల బేరం కుదిరింది. 001/ 0310/బి/ఏటీపీ/2023 ఎల్‌పీ నెంబరులో ఓ మరాఠీ వ్యాపారి భవనం నిర్మిస్తున్నాడు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో స్టిల్ట్, జీప్లస్2కు అప్రూవల్ తీసుకున్నారు. ఇక్కడ సెల్లార్‌కు అనుమతి తీసుకోలేదు. కానీ అదనంగా సెల్లార్ కోసం తవ్వేశారు. ఇందుకు అనధికారికంగా అధికారులు అనుమతిచ్చేశారు. ఈ వ్యవహారంలో రూ.5లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. అందులో చెరో రూ.2.5 లక్షలు ఇద్దరు పంచుకున్నారు. ఇందులో ఒకరు టౌన్‌ప్లానింగ్ అధికారి కాగా మరొకరు పాలకవర్గంలో కీలక మహిళా కార్పొరేటర్ భర్త కావడం గమనార్హం. భవనం పూర్తి కాక మునుపే పైసలు జేబుల్లో నింపుకోవడం ఇక్కడ చాలా కామన్‌గా జరిగిపోతుందట.

### బెటర్‌మెంట్ చార్జీనే ఎగ్గొట్టారు..

నగరంలోని మారుతీనగర్‌లో ఓ బిల్డింగ్‌కు బెటర్‌మెంట్ చార్జెస్‌నే ఎగరకొట్టారు. ఎల్‌టీపీగా ఉన్న ఓ వ్యక్తి లాగిన్‌ను బ్లాక్ చేశారు. కానీ మరో ఎల్‌టీపీ లాగిన్ నుంచి ఆ బిల్డింగ్ అప్రూవల్‌కు పెట్టుకున్నాడు. 1001/0375/బీ/ఏటీపీ/ఎంఆర్‌టీఎన్/2023 ఎల్‌పీలో బిల్డింగ్‌కు నాన్ అప్రూ వల్ లేఅవుట్. ఇందుకు 14శాతం బెటర్‌మెంట్ చార్జెస్ చెల్లించాలి. జీప్లస్2 కింద అనుమతి వచ్చింది. కానీ బెటర్‌మెంట్ చార్జెస్ ఎగ్గొట్టారు. చాలా అక్రమ కట్టడాల్లో భాగమున్న ఈ డూప్లికేట్ ఎల్‌టీపీకి టౌన్‌ప్లానింగ్ అధికారులతో లెక్కల సంబంధాలు బాగానే ఉన్నాయి. దీంతో ఆ బెటర్‌మెంట్ చార్జెస్ లేకుండా టౌన్‌ప్లానింగ్ అధికారి రూ.6లక్షలు పుచ్చుకున్నారట. ఇందులో టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారికి సైతం వాటా వెళ్లినట్లు సమాచారం.


సూర్యానగర్ పరిధిలోని రాజురోడ్డులో సెల్లార్ తవ్వడంతో పాటు ఇంపాక్ట్ ఫీజు ఎగ్గొట్టి నిర్మాణ పనులు చేపడుతున్న స్థలం

### ఇంపాక్ట్ ఫీజుకు ఎసరు...

నగరంలోని సూర్యానగర్ పరిధి రాజురోడ్డులో ఉండే ఓ భవనం ఇంపాక్ట్ ఫీజుకు ఎసరు పెట్టారు. 1001/0625/బీ/ఏటీపీ ఎల్‌పీ నెంబరు కింద స్టిల్ట్, జీప్లస్2కు అనుమతి తీసుకున్నారు. సెల్లార్‌కు అనుమతి లేకపోయినా పెద్ద గుంతనే తవ్వేశారు. ఇక ప్రధాన రహదారుల్లో నిర్మించే భవనాలకు ఇంపాక్ట్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆ మేరకు ఇంపాక్ట్ ఫీజు రూ.3.26లక్షలు విధించారు. ఆ ఫీజు ఎగ్గొట్టేలా చేశారు. ఇంపాక్ట్ ఫీజు ఎగనామాకు, సెల్లార్ తవ్వినందుకు గాను ఇక్కడ టౌన్‌ప్లానింగ్ అధికారి రూ.3లక్షలు వసూలు చేసినట్లు సమాచారం.

### మూడు సెంట్లలోనే సెల్లార్...


కమలానగర్‌లో తక్కువ స్థలంలోనే సెల్లార్

నగరంలోని కమలానగర్ డీసీఎంఎస్ రోడ్డులో మూడు సెంట్లలోపు ఉన్న స్థలంలోనే సెల్లార్ తవ్వేశారు. నగరంలో ఆ సంస్థకు బిల్డింగ్‌ల విషయంలో బాగానే అనుభవముంది. చాలా తక్కువ సెంట్లలో సెల్లార్ తవ్వేశారు. ఇందుకోసం టౌన్‌ప్లానింగ్ అధికారులకు భారీగానే ముడుపులు అందినట్లు సమాచారం. టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఓ ఉన్నతాధికారికి, కిందిస్థాయి అధికారికి ప్రతి బిల్డింగ్‌లో సగం సగం వాటా పంచుకునే అలవాటు ఉందట. అందులో భాగంగానే దీనికి అనుమతులిచ్చేసినట్లు సమాచారం.

నగరంలోని విద్యుత్‌నగర్ సర్కిల్ సమీపంలోని ఓ భవన నిర్మాణానికి సంబంధించి రూ.8లక్షల నుంచి రూ.10లక్షలు వసూలు చేశారు. ఇందులోనూ 14శాతం బెటర్‌మెంట్ చార్జెస్ చెల్లించకుండా ఎగ్గొట్టినట్లు సమాచారం. ఓ అధికారి, ఓ వైసీపీ నేత, మరో ప్రైవేట్ వ్యక్తి ఇందులో జోక్యం చేసుకున్నట్లు సమాచారం.

### సెల్లార్ల తవ్వకాలపై చర్యలు తీసుకుంటాం

నగర పరిధిలో అనుమతుల్లేకపోయినా సెల్లార్లు తవ్వుతున్న విషయం వాస్తవమే. ఇంపాక్ట్ ఫీజుల ఎగవేత విషయంలోనూ కొందరికి నోటీసులిచ్చాం. కొన్ని భవనాలకు సంబంధించి ఫీజులు కట్టించాం. అనధికారిక కట్టడాలపై చర్యలు తీసుకుంటాం.

- హరిప్రసాద్, ఏసీపీ, నగరపాలిక

# ఉపాధి కూలి @ బ్యాంకు




ఉపాధి కూలీల సొమ్ము బ్యాంకు ఖాతాలకే

ఇబ్బంది పడతామంటున్న కూలీలు

లబ్ధిదారులను తగ్గించేందుకేనని ఆరోపణ

అనంతపురం క్లాక్‌టవర్: ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్ ఈజీఎస్) ద్వారా కూలీలకు అందజేసే సొమ్ము ఇకపై వారి బ్యాంకు ఖాతాలకే జమచేయాలని ప్రభుత్వాలు నిర్ణయించాయి. కూలీల ఆధార్ సంఖ్యతో అనుసంధానమై ఉన్న బ్యాంకు ఖాతాకు నగదు జమ అయ్యేలా చేయనున్నారు. ఈ ప్రక్రియను ఉపాధి కూలీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఉపాధి కూలీల సంఖ్యను తగ్గించేందుకే బయోమెట్రిక్, ఆధార్ ఆధారిత బ్యాంకు అకౌంట్లకు వేతనాల చెల్లింపులు, ఫేసియల్ యాప్ అంటూ కొత్త నిబంధనాలు విధిస్తున్నారనే విమర్శలు వినవస్తున్నా యి. ఈక్రమంలోనే గత మూడు నెలలుగా జిల్లాలో సుమారు రూ.19 కోట్ల వేతనాల చెల్లింపులు నిలిచిపోయాయి. పెరుగుతున్న సాంకేతికతను దృష్టిలో ఉంచుకుని ఉపాధి కూలీలకు బయోమెట్రిక్, ఫేసియల్ యాప్, బ్యాంకు అకౌంట్లలోకి నేరుగా చెల్లింపులు చేసేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. అయితే అదే టెక్నాలజీని వాడి పింఛన్ లబ్ధిదారులకు కూడా నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి ఎందుకు జమచేయడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

### తగ్గుతున్న ఉపాధి కూలీల సంఖ్య

ప్రతి ఏటా ఉపాధి కూలీల సంఖ్య తగ్గుతోంది. ఉమ్మడి జిల్లాలో 2019లో 8.7లక్షల జాబ్‌కార్డులు ఉండేవి. మొత్తం 12లక్షలమంది కూలీలు పనులు చేస్తుండేవారు. జిల్లా విభజనతో అనంతపురం జిల్లాలో 4.5లక్షలు ఉండాలి. అయితే ప్రభుత్వం విధించిన కోతలతో ప్రస్తుతం 3.5లక్షలు జాబ్‌కార్డులు మాత్రమే ఉన్నాయి. ఇందులో 5లక్షల మంది మాత్రమే ఉపాధి కూలీలు ఉన్నారు. వీరిలో 2లక్షల మందికి మాత్రమే పని కల్పిస్తున్నారు. సాధారణంగా 82రకాల పనులు ఉండగా.. వాటిలో కోతలు విధించడంతో ప్రస్తుతం నాలుగు రకాలు పనులు మాత్రమే కల్పిస్తున్నారు.


పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

- డబ్బు అకౌంట్లలోకి వేస్తే తీరని నష్టం

ఉపాధి కూలీలకు ఇక నుంచి బ్యాంకు అకౌంట్లలోకి కూలి సొమ్ము జమ చేయాలని కేంద్రం నిర్ణయించింది. బినామీ పేర్లతో పనిదినాల నమోదు, అనధికారిక చెల్లింపులకు అడ్డుకట్ట వేయడానికే అంటున్న ప్రభుత్వా లు...వాటిని ఎందుకు నియంత్రించడం లేదని కూలీలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే బయోమెట్రిక్, ఫేసియల్ యాప్‌తో లబ్ధిదారులను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వాలు అకౌంట్లలోకి చెల్లింపులు పేరుతో కొత్త ఇబ్బంది పెడుతున్నారని కూలీలు వాపోతున్నారు. ఎందుకంటే ఉపాధి పని కి వచ్చే కూలీల్లో చాలా మంది నిరక్షరాస్యులు. వారు బ్యాంకు అకౌంట్లో ఎంత సొమ్ము పడిందో ఒక వేళ పడకపోతే ఎందుకు పడలేదో తెలుసుకోవడం కష్టమవుతుంది. ఇప్పటికే టీసీఎస్ సాఫ్ట్‌వేర్ నుంచి ఎన్‌ఐసీ సాఫ్ట్‌వేర్‌కి మార్చడంతో గతంలో ఇస్తున్న వేసవి అలవెన్సులు, వేసవిలో పనిచేసే చోట నీడ, నీరు, మెడికల్ కిట్లకు కోత విధించారు.



డ్వామా కార్యాలయం

### ఆన్‌లైన్ చెల్లింపులతో నష్టం



ఉపాధి కూలీలకు దినసరి కూలి నగదు రూపంలోనే చెల్లించాలి. ఆన్‌లైన్‌లో బ్యాంకు ఖాతాల్లోకి సొమ్ము జమచేస్తామని ప్రభుత్వాలు మోసం చేయడా నికే కుట్ర చేస్తున్నాయి. ఇదంతా పథకాన్ని నిర్వీర్యం చేయడంలో భాగమే. ఇప్పటికే బయోటమెట్రిక్, ఫేసియల్ యాప్, సాఫ్ట్‌వేర్‌ను మార్చి మాకు సరిగ్గా డబ్బులు చెల్లించడం లేదు. ఇక బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తామనడం అంటే మరింత ఇబ్బంది పెట్టడమే.

- నాగమణి, ఉపాధి కూలీ, కంబదూరు

### సమస్యలున్నచోట మాత్రమే మినహాయింపు...

ఉపాధి హామీ కూలీలకు జనవరి నుంచి ఆధార్ ఆధారిత చెల్లింపులను తప్పనిసరి చేయడంపై ఇటీవల కేంద్రం ప్రకటన చేసింది. ఏదైనా గ్రామ పంచాయతీలలో ఆధార్ ఆధారిత చెల్లింపులు చేయడానికి సాంకేతిక సమస్యలు కానీ, ఆధార్ పరమైన ఇబ్బందులు తలెత్తినప్పుడు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చేలా చర్యలు తీసుకుంటోంది. తలెత్తిన సమస్య పరిష్కారం అయ్యేవరకు అవకాశం కల్పించనుంది. లబ్ధిదారులతో ఆధార్‌ను అనుసంధానం చేయడం అన్నది నిరంతర ప్రక్రియ. నిజమైన లబ్ధిదారులను గుర్తించి నకిలీలను ఏరిపారేయడానికి ఇది ఉపకరిస్తుందని కేంద్రం పేర్కొంది.

### నిర్వీర్యం చేస్తే ఒప్పుకోం



ఉపాధి పథకంలో అనేక మార్పులు చేస్తూ వస్తున్నారు. అయితే ఎన్ని మార్పులు చేసినా కూలీలలకు నష్టం కలిగేలా ఉండకూడదు. అలా ఉపాధి కూలీలకు నష్టం కలిగేలా నిర్ణయాలు తీసుకుంటే నిరసన చేపడతాం. పథకాన్ని పటిష్టం చేయాలి. నిర్వీర్యం చేయొద్దు.

- చిన్నరాయుడు, మేట్ల సంఘం నాయకుడు, విడపనకల్లు

### ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేయాల్సిందే



ప్రభుత్వాలు చేసిన ఆదేశాలు, నిర్ణయాలను అమలు చేసే బాధ్యత ఉద్యోగులపై ఉంటుంది. ప్రభుత్వ సూచనలు పాటించాల్సిందే. ఉపాధి హామీ పథకంలో పెరుగుతున్న సాంకేతికత ఆధారంగా అనేక మార్పులు తెస్తున్నారు. కూలీలకు నేరుగా బ్యాంకు అకౌంట్లలోకి జమచేయడంతో మంచే జరుగుతుంది. తప్పులు జరిగేందుకు అవకాశం ఉండదు. లోపాలను, తప్పులు జరగకుండా చూడటానికే పథకంలో మార్పులు చేస్తున్నారు. జాబ్ కార్డు కలిగిన కూలీలందరికీ మేలు జరుగుతుంది. బకాయిలను త్వరలో చెల్లిస్తాం. - వేణుగోపాల్ రెడ్డి, డ్వామా పీడీ

## ఇల్లు అలకగానే పండుగ కాదు

మెట్టు గోవిందరెడ్డికి కాపు పరోక్ష హెచ్చరిక

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 10: వైఎస్సార్ ఆసరా సొమ్ము పంపిణీ వేదికపై ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి పరస్పరం విమర్శలు గుప్పించుకున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే కాపు స్థానంలో మెట్టును వైసీపీ ఈ ఎన్నికల్లో అభ్యర్థిగా ఖరారు చేసింది. ఈ నేపథ్యంలో పార్టీకి దూరమైన కాపు, మెట్టుపై విమర్శలు గుప్పించారు. 'ఇల్లు అలికినంతమాత్రాన పండుగ కాదు.. టిక్కెట్ వచ్చినంతమాత్రాన ఎమ్మెల్యే కాలేరు' అని కాపు అన్నారు. తాను ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నానని, కొందరు సాయంత్రం ఆరున్నరకే భోజనం చేసి.. 8 గంటలకే నిద్రబోతారని విమర్శించారు. జిల్లాలో ఎక్కడా జరగనంత అభివృద్ధిని నియోజకవర్గంలో చేశానని కాపు అన్నారు. అనంతరం మైక్ తీసుకున్న మెట్టు.. తాటాకు చప్పుళ్లకు తాను భయపడనని అన్నారు. ఎమ్మెల్యే కాకముందే దేవాలయాలకు రూ.కోటి విరాళాలు ఇచ్చానని, కంటి ఆపరేషన్లు చేయించానని, ఆసుపత్రులకు మంచాలు ఇచ్చానని అన్నారు. సభలో మెట్టు గోవిందరెడ్డికి అనుకూలంగా వైసీపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. పోలీసుల కాపును వాహనాల వద్దకు తీసుకెళ్లి అక్కడి నుంచి పంపించేశారు.




మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి, పక్కనే ఎమ్మెల్యే కాపు



# అంకితభావమే విజయ రహస్యం

సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమానుల్లా

జేఎన్‌టీయూలో యువ న్యాయవాదుల వర్క్‌షాప్

హాజరైన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ భట్టి, జస్టిస్ మిశ్రా



**అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 10:** వృత్తిపట్ల అంకిత భావంతో పనిచేస్తేనే కేసులలో విజయం దక్కుతుందని, కక్షి దారులకు న్యాయం చేయగలరని సుప్రీం కోర్టు న్యాయ మూర్తి జస్టిస్ ఎహసానుద్దీన్ అమానుల్లా అన్నారు. జేఎన్‌టీ యూలో శనివారం నిర్వహించిన యువ న్యాయవాదుల వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిం చారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సారథ్యంలో రాష్ట్ర బార్ కౌన్సిల్, అనంతపురం జిల్లా బార్ అసోసియేషన్ సంయు క్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. గౌరవ అతిథు లుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎస్‌వీఎన్ భట్టి హాజరయ్యారు. ఈ సంద ర్భంగా జస్టిస్ అమానుల్లా మాట్లాడుతూ, పౌర హక్కులు హరించబడితే దేశ స్థిరత్వంపై ప్రభావం పడుతుందని అన్నారు. దేశాభివృద్ధిలో అన్ని రంగాలు సమానపాత్ర పోషి స్తాయని, వాటి పరిరక్షణకు న్యాయవ్యవస్థ నిరంతరం పనిచే స్తుందని అన్నారు. న్యాయ విద్యార్థి నుంచి న్యాయమూర్తి వరకు న్యాయవ్యవస్థలో కుటుంబ సభ్యులని అన్నారు.



### దేశ నిర్మాణంలో మీరే కీలకం: జస్టిస్ భట్టి



న్యాయవాదులు ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యమని జస్టిస్ వెంకటనారాయణ భట్టి అన్నారు. సుసంపన్నమైన దేశాన్ని నిర్మించడంలో న్యాయవాదుల పాత్ర కీలకమని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయవాది కావడంతో మహోన్నతమైన రాజ్యాంగాన్ని రచించారని అన్నారు. రాజ్యాంగం దేశానికి స్థిర పాలనను అందిస్తుందని అన్నారు. పరిశ్రమలు, నీటిపారుదల, పరిశోధ నలు, వ్యవసాయ భూములు దేశ సంపద సృష్టికి మూలాలని అన్నారు. న్యాయమూర్తులు, లాయర్స్, అడ్వకేట్స్, న్యాయ విద్యార్థులు దేశ నిర్మాణంలో ముఖ్య పాత్రపోషించాలని పిలుపుని చ్చారు. ప్రతి న్యాయవాదీ వృత్తి పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. పౌరుల హక్కు లను పరిరక్షించే బాధ్యత న్యాయవాదులపై ఉందని అన్నారు.

### గెలవగలననే నమ్మకం ఉండాలి: జస్టిస్ మిశ్రా

ఫైల్‌ను పూర్తిగా చదివినప్పుడే న్యాయవాది కేసును సక్రమంగా వాదించగలరని జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అన్నారు. లేకుంటే కోర్టు సమయాన్ని వృథా చేసినవారు అవుతారని అన్నారు. న్యాయవాదులకు కేసును జయించగలనన్న నమ్మకం ఉండాలని అన్నారు. అందుకు సానుకూల వాతావరణాన్ని సృష్టించుకోవాలని సూచించారు. అప్పుడే న్యాయ నిర్ణేత సహకారం లభిస్తుందని అన్నారు. నేడు సాంకేతిక పరిజ్ఞాన వినియోగం పెరిగిందని అన్నారు. కంప్యూటర్ ద్వారా ఆర్టిఫీ



షియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అభివృద్ధిపరిచిన ప్లాట్‌ఫామ్‌లో అన్నిం టికీ సమాధానం లభిస్తోందని అన్నారు. దీంతో కట్ అండ్ కాపీ పేస్ట్ పద్ధతిలో సులువుగా సారాంశాన్ని పొందుపరుస్తున్నారని అన్నారు. కొన్ని దశాబ్దాల క్రితం కేస్ ఫైల్‌ను క్షుణ్ణంగా చదివి, రాసే వారమని గుర్తు చేసుకున్నారు. ఈ ప్రక్రియ సబ్జెక్టుపై పట్టుసాధిం చేలా చేసేదని అన్నారు. అనవసర విషయాలను మెదడులో చొప్పిం చకుండా, ప్రతిరోజూ ఒక అంశంపై సొంతంగా ప్రాక్టీస్ చేయడం అలవర్చుకోవాలని న్యాయవాదులకు సూచించారు.



### ఘన సత్కారం

వర్క్‌షాప్‌లో రాష్ట్ర హైకోర్టు న్యామూర్తులు జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ దుర్గాప్రసాద్ రావు, జస్టిస్ సురేష్‌రెడ్డి, జస్టిస్ మన్మథరావు, జస్టిస్ శ్రీనివాసరెడ్డి, జస్టిస్‌శ్యామ్‌సుందర్, జిల్లా కోర్టు న్యాయాధికారి శ్రీని వాస్ న్యాయ విద్యార్థులకు వృత్తి నిబద్ధత గురించి వివరించారు. వర్క్‌షాప్‌నకు హాజరైన న్యాయూర్తు లను జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. బీసీఐ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఆలూరు రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌నకు బీసీఐ చైర్మె న్ ప్రభాకరన్, వైస్ చైర్మన్ మనోజ్ కుమార్, కో చైర్మె న్ శ్రీనాథ్, సభ్యులు ప్రశాంత్ కుమార్ సింగ్, దిలీప్ పటేట్, విష్ణువర్ధన్ రెడ్డి, ప్రతాప్ సింగ్, డీకే శర్మ, భక్త భూషన్, ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామా రావు, వైస్ చైర్మన్ రామజోగేశ్వర రావు, సభ్యులు క్రిష్టారెడ్డి, చిదంబరం, చెన్నకేశవరెడ్డి, బ్రహ్మరెడ్డి, ద్వారకానాథ్ రెడ్డి, శ్రీనివాసరావు, క్రిష్ణమోహన్, బ్రహ్మానందరెడ్డి, వెంకటరామిరెడ్డి, రఘువీర, నరసిం హారావు, నాగిరెడ్డి, నాగేశ్వరరావు, సుదర్శనరావు, రాష్ట్రంలోని పలువురు లాయర్లు, అడ్వకేట్లు, న్యాయ విద్యార్థులు హాజరయ్యారు.



స్వాగతం..



న్యాయ విద్యార్థులు



గాన కచేరి..



### పటిష్ట బందోబస్తు

సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల పర్యటనకు జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. జేఎన్ టీయూ నుచి నగరం వైపు దాదాపు మూడు కిలోమీటర్ల వరకు బందోబస్తు ఏర్పాటు చేశారు. వర్క్‌షాప్‌కు రాష్ట్రం నలమూల నుంచి వందలాది మంది న్యాయవిద్యార్థులు, న్యాయవాదులు తరలివచ్చారు. ప్రముఖుల ప్రసంగం అనంతరం మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. మధ్యలోనే భోజనం అయి పోవడంతో చాలామంది ఆకలితో ఇబ్బంది పడ్డారు. రెండో శనివారం కావడంతో జేఎన్ టీయూ చుట్టుపక్కల హోటళ్లను కూడా మూసేశారు.

### అడ్డుకున్న ఇంటెలిజెన్స్?

సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులకు తమ సమస్యలను చెప్పుకోవాలని కొందరు న్యాయవాదులు తలిచారు. వర్క్‌షాప్ మధ్యలో నిరసన తెలపాలని భావించారు. దీన్ని పసిగట్టిన ఇంటెలిజెన్స్, అప్రమత్తంగా వ్యవహరించింది. ముందురోజే వారిని వర్క్ షాప్‌నకు రాకుండా అడ్డుకున్నట్లు తెలిసింది.



### లేపాక్షి శిల్పకళా సంపద అమోఘం


సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అమానుల్లా, జస్టిస్ భట్టి

**హిందూపురం, ఫిబ్రవరి 10:** ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో శిల్పకళా సంపద అమోఘమని సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ వెంకటనారాయణ భట్టి అన్నారు. లేపాక్షిలోని ఆలయాన్ని శనివారం వారు సందర్శించారు. న్యాయమూర్తులకు ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో శిల్ప సంపద ప్రత్యేక తలను వారికి గైడ్స్ వివరించారు. ఏడు శిరస్సుల నాగేంద్రుడు, సీతా దేవి పాదం, నాట్యమండపం, అర్థంతరంగా ఆగిన కల్యాణమండపం, వేలాడే స్థంభాన్ని చూసి న్యాయమూర్తులు తన్మయత్వం చెందారు. అప్పటి శిల్పుల నైపుణ్యానికి లేపాక్షి ఆలయమే నిదర్శనమని కొనియా డారు. అనంతరం ఆలయంలో దుర్గావీరభద్రులకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. న్యాయమూర్తులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించి, లేపాక్షి ఆలయ చిత్రపటాన్ని బహూకరించారు.



జిల్లా న్యాయవాదులు







## వ్యాయామ ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

**అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 10 :** ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యు డు రాంభూపాల్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 25వేల ఉపాధ్యా య పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ 2024 డీఎస్సీలో కేవలం 6,100 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు అతి తక్కువ పోస్టులు ప్రకటించారని, అందులోనూ వ్యాయామ ఉపాధ్యాయులకు స్థానం కల్పించలేదని విమర్శించారు. విద్యాహక్కు చట్టంలో భాగంగా ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూల్స్‌లో డీఎస్సీ ద్వారా పీఈటీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చే శారు. వ్యాయామ ఉపాధ్యాయ నిరుద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా 80వేల మంది ఉన్నా రని, "ఆడుదాం ఆంధ్రా" పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఆటల పోటీలు నిర్వహించడం క న్నా పీఈటీ పోస్టులు భర్తీ చేస్తే క్రీడాకారులు తయారవుతారన్నారు.

## రియా ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న రియా వైద్యులు

**విడపనకల్లు, ఫిబ్రవరి 10:** మండల కేంద్రంలో శనివారం ఉదయం అనంతపురం రియా ఆసు పత్రి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రియా వైద్యు లు ఉదయ్‌కుమార్, గీతా స్వర్ణ మాట్లాడుతూ మండలంలో వివిధ గ్రామాల ప్రజలు అనేక సమ స్యలతో ఇబ్బందులు పడు తూ ఉంటారని, వారికి ఉన్న వ్యాధులను గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామ న్నారు. ముఖ్యంగా బీపీ, షుగర్ వంటి వాటిని పరీక్షించి తగిన మందులు, జాగ్రత్తలు అందజేస్తామన్నారు. వైద్య శిబిరంలో 600 మందికిపైగా పరీక్షించి, అవసరమైనవారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. రియా ఎండీ లక్ష్మీప్రసాద్, సీఈఓ మురళీ కృష్ణ వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. రియా వైద్యులు శివా, ఆసుపత్రి సిబ్బంది వైద్యం అందించారు. టీడీపీ మండల కన్వీనర్ బీడీ చిన్న మారయ్య, సర్పంచ్‌లు తిప్పారెడ్డి, చంద్రశేఖర్, జనార్దన నాయుడు, నాయకులు సినిమా రామాంజనేయులు, భీమలింగప్ప, హనుమంతు, రంగస్వామి, భాస్కర్‌నాయుడు, అశోక్‌కుమార్, రాజు స్వామి, నూతేటి రామక్రిష్ణ, జయరాములు, ఆర్ కొట్టాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

## పశువుల అక్రమ రవాణా కేసులో ఆరుగురి అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ

**తాడిపత్రి, ఫిబ్రవరి10:** పశువులను అక్రమంగా తరలిస్తున్న కంటైనర్ బోల్తాపడ్డ సంఘటనలో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశామని అడిషనల్ ఎస్పీ విజయభా స్కర్‌రెడ్డి తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 6న 49ఎద్దులు, ఆవులతో వెళుతున్న కంటైనర్ పెద్దవడుగూరు మండలం కాశేపల్లి టోల్‌ప్లాజా వద్ద బోల్తాపడ్డ ప్రమా దంలో ఇద్దరు కూలీలు, 36 ఆవులు, ఎద్దులు మృతి చెందిన ఘటనలో విచారణ జరి పామన్నారు. హర్యానా రాష్ట్రం పత్వాల్ జిల్లా కోట్ గ్రామానికి చెందిన కంటైనర్ డ్రైవర్ వాహీద్, తెలంగాణా రాష్ట్రం హైదరాబాద్‌లోని చార్మినార్‌కు చెందిన మహమ్మ ద్‌ఫిరోజ్ ఖురేషి, రంగారెడ్డిజిల్లా కందుకూరు మండలం నీడ్‌నూర్ గ్రామానికి చెందిన కంటైనర్ యజమాని మహమ్మద్ అజాముద్దీన్, సత్యసాయి జిల్లా హిందూపురంలోని మోడల్ కాలనీకి చెందిన ఖురేషిటిప్పు, కడపజిల్లా పులివెందులలోని పురుషోత్తంరెడ్డి కాలనీకి చెందిన నాగేంద్ర, అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం ఇల్లూరుకుచెం దిన నల్లప్పలు కలిసి పశువుల అక్రమ రవాణాలో నిందితులుగా ఉన్నారన్నారు. వీరంతా ఒక ముఠాగా ఏర్పడి తక్కువ ధరలకు పశువులను కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకొనే వారన్నారు. ఒడిస్సా రాష్ట్ర సరిహద్దు ప్రాంతం నుంచి ఆవులు, ఎద్దులను కొనుగోలు చేసేవారన్నారు. వీటిని శ్రీకాకుళం జిల్లా నరస న్నపేట వద్ద బొలెరోలో 4నుంచి 5పశువులను ఎక్కించి ఏలూరు జిల్లా ఏవూరు హనుమాన్ జంక్షన్‌కు తరలించారన్నారు. అక్కడి నుంచి ఖురేషిటిప్పు ద్వారా బెంగ ళూరు, కేరళకు తరలించే ప్రయత్నంలో ఈ ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదంపై ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు డీఎస్పీ గంగయ్య ఆధ్వర్యంలో యాడికి సర్కిల్ సీఐ రోషన్, పెద్దవడుగూరు ఎస్ఐ శ్రీనివాసులు గాలింపు చర్యలు చేపట్టి వారిని అరె స్ట్ చేశారన్నారు. ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, డీఎస్పీ గంగయ్య పాల్గొన్నారు.

## కిడ్నాపైన వ్యక్తి పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యక్షం

● భూమిని తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించమని వైసీపీ నాయకులు ఒత్తిడి చేశారు ● విలేకరుల ఎదుట బాధితుడి వెల్లడి

**ధర్మవరం, ఫిబ్రవరి 10:** కిడ్నాపైన వ్యక్తి పోలీస్ స్టేషన్లో ప్రత్యక్షమ య్యాడు. బత్తలపల్లి మండలం గంటాపురంగ్రామానికి చెందిన అక్కిం లక్ష్మయ్య పెద్దకుమారుడు పెద్దప్పయ్య కిడ్నాప్ విషయం శుక్రవారం ధర్మవ రంలో కలకలం రేపిన సంగతి తెలిసిందే. అయితే శనివారం పెద్దప్పయ్య స్థానిక వన్‌టౌన్‌పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యక్షమయ్యాడు. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న పెద్దప్పయ్యను కిడ్నాప్‌పై విలేకరులు ఆరాతీశారు. పెద్దప్పయయ్య విలేకరు లతో మాట్లాడుతూ...తనను కొందరు వైసీపీ రెడ్లు రూ.లక్ష ఇస్తాం నీ భూమిని వారి పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలని ఒత్తిడి చేశారన్నారు. తన తండ్రి లక్ష్మయ్య బతికున్నప్పుడు వారికి అమ్మాడని, ఆ భూ మిని రిజిస్ట్రేషన్ చేయించాలని ఒత్తిడి తెచ్చారన్నారు. తన తండ్రి అమ్మిఉంటే తన తండ్రితో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వారికి ఖరాఖండిగా చెప్పానన్నాడు. అంతేకాకుండా తన తమ్ముడి పిల్ల లు ఉన్నారని ఆ భూమిని వారికి అవసరమని తెలి పారు. తనను కిడ్నాప్ చేసిన వారిపై పోలీసులకు పిర్యాదు చేశానన్నారు. ఇది ఇలా ఉండగా కిడ్నాప్ విషయం పత్రికల్లో రావడంతో పెద్దప్పయ్య గంటా పురం గ్రామంలో ఉన్నట్లు సమాచారం అందుకుని స్టేషన్‌కు తీసుకు వచ్చామని, కిడ్నాప్ చేశారా లేదా అన్న విషయంపై విచారణ జరుపుతున్నామని వన్ టౌన్ సీఐ సుబ్రమణ్యం మీడియాకు తెలిపారు.



మాట్లాడుతున్న పెద్దప్పయ్య

## నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

**అనంతపురం విద్య, ఫిబ్రవరి 10:** ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం నుంచి ప్రారంభం కాను న్నాయి. ఈనెల 20వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించ నున్నారు. నిర్ణీత తేదీల్లో రెండు పూటలా పరీక్షలు నిర్వ హించనున్నట్లు బోర్డు అధికారులు ప్రకటించారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్న ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 170 జూనియర్ కళాశాలు ఉండగా అందులో 70 జనరల్ ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలు, 10 ఒకేషనల్ కేంద్రాలను అధికారులు ఏర్పా టు చేశారు. ఎంపీసీ విద్యార్థులు 10,124 మంది, బైపీసీ విద్యార్థులు 2721 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. అదేవిధంగా ఒకేషనల్ విద్యార్థులు 3186 మంది హాజ రుకానున్నారు.

## ఓటరు జాబితాలో బయటపడుతున్న తప్పులు



ఒకే వ్యక్తికి రెండు చోట్ల నమోదైన ఓటు

**రాయదుర్గం, ఫిబ్రవరి 10:** ఎన్నికల కమిష న్ పారదర్శకంగా ఓటర్ల జాబితాను తయారు చేశామని ప్రకటిస్తున్నప్పటికీ లోపాలు మా త్రం ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. రాయదుర్గం పట్టణంలో 228 పోలింగ్ కేంద్రంలో శ్రీరాముల శ్రీకాంత్‌కు సీరియల్ నంబర్ 1170లో ఒకచోట, అదే పేజీలో ప్రక్కన 1171 సీరియల్ నంబర్‌లో మరో చోట రెండు ఓట్లు కల్పించారు. ఎస్ఆర్ తేజ్‌కుమార్ అనే వ్యక్తికి 227 పోలింగ్ కేంద్రంలో 1012, 1020 సీరియల్ నంబర్లలో ఓటు హక్కు కల్పించారు. 228 పోలింగ్ కేంద్రంలో 387 సీరియల్ నంబర్‌లో కూడా అవకాశం కల్పించారు. కృష్ణకాంత్ అనే యువకుడికి 228 పోలింగ్ కేంద్రంలో 1177 సీరియల్ నంబర్‌లో ఓటు నమోదు కాగా, 227 పోలింగ్‌బూత్‌లో 1013 సీరియల్ నంబర్‌లో మళ్లీ ఓటరుగా నమోదు చేశారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. బెంగళూరులో నివాసముంటూ ఎన్నికలకు మాత్రమే ఓటుహక్కు వినియోగించు కోవడానికి వచ్చే ముగ్గురికి ఏడు చోట్ల అవకాశాలు కల్పించారు.

### కొత్త జాబితాలో పాత తప్పులు

**బొమ్మనహాళ్ :** మరణించిన వారిని, ఊర్లో లేని వారిని, పెళ్లైన వారిని ఓటర్లుగా తుది జాబితాలో ఉంచారు. ఊరు వదిలిపోయినవారు. మరణించినవారు, ఊర్లో లేని వారు, పెళ్లైన వారి పేర్లు ఓటరుజాబితాలో కొనసాగుతున్నాయి. మండలంలోని నేమకల్లు గ్రామంలో 45, 46 కేంద్రాలలో ఓటరు జాబితాను పరిశీలిస్తే 150 మందికిపైగా అనర్హులను ఓటర్లుగా నమోదు చేశారనే విమర్శలు వస్తున్నా యి. కర్ణాటకలో నివాసం ఉంటున్నవారిని జాబితాలో పొందుపరిచారు. సవరణకు ఎక్కువ స్థాయిలో దరఖాస్తులు వచ్చినా పరిశీలించకుండా తుదిజాబితా విడుదల చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## ఎలా బతకాలి నాన్న ?





రైలు కింద పడి రామకృష్ణ ఆత్మహత్య

**యాడికి, ఫిబ్రవరి 10:** భార్య, కుమార్తెను హత్య చేసిన రామకృష్ణ (28) శనివారం తాడిపత్రి మండలంలోని పెద్ద పొలమడ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకు న్నాడు. దీంతో వారి పెద్దకూతురు శాన్విత ఒంటరిగా మిగిలిపోయింది. ఇకపై తన భవిష్యత్తు ఏమిటో తెలియని పరిస్థితి. ఎల్‌కేజీ చదువుతున్న ఈ నాలుగేళ్ల చిన్నారికి ఇప్పుడు అవ్వాతాత, బంధువులే దిక్కయ్యారు. యాడికి చౌడేశ్వరికాలనీలో భార్య చంద్రావతి, చిన్న కుమార్తె చైత్రి కను అతి దారుణంగా చంపి, రామకృష్ణ పరారయ్యాడు. ఈ సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. రామకృష్ణ కోసం పోలీసులు గాలిస్తుండగా, పెద్దపొలమడ వద్ద ఆత్మహత్య చేసుకున్నాడు. రామకృష్ణ సోదరుడి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదే హాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. భార్య, కుమా ర్తెను హత్యచేశానన్న మనస్తాపంతోనే రామకృష్ణ ఆత్మ హత్య చేసుకుని ఉంటాడని అతడి సోదరుడు ఫిర్యాదు ఇచ్చినట్లు తెలిసింది. తండ్రి క్షణికావేశంతో తల్లిని, చెల్లిని కోల్పోయిన శాన్విత, ఇప్పుడు తండ్రిని కూడా కోల్పోయింది. శాన్విత పరిస్థితిని తలచుకుని స్థానికులు అయ్యో దేవుడా ఈ చిన్నారికి దిక్కెవరు అంటూ కన్నీటిపర్యంతమయ్యారు.

**అప్పులే కారణమా......?**

రామకృష్ణ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ఆడేవాడని స్థానికులు చర్చించుకుంటున్నారు. కొద్ది మొత్తంలో అప్పులు కూడా చేసినట్లు తెలిసింది. ఈ అప్పులు తీర్చడానికి రామకృష్ణ సోదరులు సాయం అందిస్తామని హామీ కూడా ఇచ్చినట్లు చర్చ జరుగుతోంది. మరి ఇటువంటప్పుడు రామకృష్ణ భార్యను, కుమార్తెను చంపాల్సిన అవసరం ఏముంది? ఆ తర్వాత రెండురోజులకు రామకృష్ణ ఆత్మహత్య ఎందుకు చేసుకున్నట్లు అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఆత్మ హత్యకు పాల్పడ్డ రామకృష్ణ తన కాలిపై నిన్ను, పాపను కాపాడుకోలేక పోయాను నన్ను క్షమించు, అత్తా పాపని బాగా చూసుకోండి అని సూసైడ్ నోట్ ఎందుకు రాసుకు న్నాడో అర్థం కాని విషయం. మృతిచెందిన ముగ్గురికీ అంత్యక్రియలు కిష్టిపాడులో నిర్వహించారు.

## చికిత్స పొందుతూ చిరుత మృతి

**పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 10 :** రోడ్డు ప్రమాదంలో గాయప డిన చిరుత చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈనెల 5న మంగళవారం తెల్లవారుజామున పెనుకొండ సమీపంలోని పులే కమ్మ ఆలయం 44వ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వా హనం ఢీకొనడంతో చిరుతపులి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. గాయపడ్డ చి రు తను చికిత్స నిమిత్తం తిరు పతి జూ కు తరలించారు. చికి త్స పొందుతూ శనివారం ఉద యం చిరుత మృతి చెందినట్లు డీఆర్‌ఓ శివరాం తెలిపారు.



గాయపడిన చిరుత (ఫైల్)

## విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

● సైన్స్‌ఫెయిర్ రాష్ట్ర పరిశీలకులు శ్రీ స్వరాజ్ ● సందడిగా జిల్లా 11వ విజ్ఞాన ప్రదర్శన

**రాప్తాడు, ఫిబ్రవరి 10:** ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఉన్నత స్థాయికి ఎదగాలని సైన్స్‌ఫెయిర్ రాష్ట్ర పరిశీలకుడు శ్రీ స్వరాజ్ పిలుపునిచ్చారు. రాప్తాడు మండలంలోని పంగల్‌రోడ్డు సమీపాన ఆదర్శ పాఠశాలలో శనివారం జిల్లా 11వ సైన్స్‌ఫెయిర్ నిర్వహిం చారు. సదస్సును గుత్తి డీవైఈఓ శ్రీదేవి ప్రారంభించారు. జిల్లాలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని పలు రకాల ప్రాజె క్టుల నమూనాలను ప్రదర్శించారు. మొత్తం 106 ప్రాజెక్టులకు గానూ 91 ప్రాజెక్టులు ప్రదర్శనలో ఉంచారు. సైన్స్‌ఫెయిర్ రాష్ట్ర పరిశీలకులు శ్రీ స్వరాజ్ అన్ని ప్రాజెక్టులను పరిశీలించారు. ఆర్ట్స్ కళాశాలకు చెందిన అధ్యాపకులు ప్రసాద్, రఘువర్మ, శ్రీదేవి, రామకృష్ణ, తదితరులు ప్రాజెక్టులను పరిశీలించి 7 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. జిల్లా స్థాయి విజేతలను డీఈఓ వరలక్ష్మి ప్రకటించారు. 1. గేణేష్ రెడ్డి హనకనహల్ ఉన్నత పాఠ శాల. కనేకల్లు మండలం. 2. చరణ్ ఎన్. నరసాపురం ఉన్నత పాఠశాల గుంతకల్లు మండలం. 3. జ్యోతి కసాపురం గుంతకల్లు మండలం. 4. శకుంతల కరకముక్కల ఉన్నత పాఠశాల విడపన కల్లు మండలం. 5.ప్రణతి బెస్తరపల్లి ఉన్నత పాఠశాల కుందుర్పి మండలం. 6. కీర్తన ఆదర్శ పాఠశాల విడపనకల్లు మండలం. 7. అక్షయ, గాయత్రి తాడిపత్రి. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి బాలమురళికృష్ణ, రాప్తాడు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ పద్మజా దేవి తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకులు శ్రీ స్వరాజ్

## డబుల్ ఓట్లపై చర్యలు తీసుకోండి



ఏఓకు డబుల్ ఓటర్లపై ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

**అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 10:** అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో డబుల్ ఓట్లపై చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ కార్యాలయ ఏఓ పద్మావతిని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గోపాల్ గౌడ్, యూనిట్ ఇన్‌చార్జిలు బాలప్పనాయుడు, వడ్డే మురళీకృష్ణ డబుల్ ఓటర్ల జాబితాను ఆధారాలతో సహా ఏఓకు అందజేశారు. వారు మాట్లాడుతూ... రాప్తాడు నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగిన 1500 మందికిపైగా వ్యక్తులు అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోనూ ఓట్లు ఉన్నారన్నారు. డబుల్ ఓటర్లకు సంబంధించి ఆధారాలన్నీ బూత్ నెంబర్, సీరియల్ నెంబర్, ఓటరు ఐడీలను సేకరించామన్నారు. వచ్చే ఎన్నికల్లో దొంగ ఓట్లు వేయించుకునేందుకు వైసీపీ నాయకులు కుట్రలు పన్నుతున్నారన్నారు. డబుల్ ఓటరు జాబితాను పరిశీలించి, వారికి ఒకే చోట ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బీఎల్ఏలు వెంకటేశులు, ఆఖిల్, శ్రీనివాసులు, రామాంజి, హరి పాల్గొన్నారు.

## చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి



చిన్మయ నగర్‌లో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

**రాప్తాడు ఫిబ్రవరి 10:** రానున్న ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని హిందపూపురం పార్లమెంట్ మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శి రామసుబ్బమ్మ అన్నారు. మండలంలోని చిన్మయానగర్‌లో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే నాయకుడినే ఎన్నుకోవాలన్నారు. పంజగల ప్రసన్న, స్వర్ణక్క, బాషాబాయ్, ధనుంజయ పాల్గొన్నారు.

## మార్కెట్‌లోకి మహీంద్రా నియో ప్లస్ వాహనం



నియోప్లస్ వాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న ముఖ్యఅతిథులు

**అనంతపురం రూరల్, ఫిబ్రవరి 10:** ఎంజీబీ మొబైల్స్ హహీంద్రా షోరూం వారు మహీంద్రా నియోప్లస్ బొలెరో వాహనాన్ని మార్కెట్‌లోకి తీసుకువచ్చారు. శనివారం నగరంలోని ఐఎంఏ ఆవరణంలో ముఖ్యఅతిథులు వైద్యులు బీవీఎన్ చౌదరి, శ్రీనాథ్, అచ్యుత్ ప్రసాద్ చేతుల మీదుగా మార్కెట్‌లోకి విడుదల చేశారు. సంస్థ సీఈఓలు ఆదిత్య మాచాని, సోమనాథ్‌మాచాని మాట్లాడుతూ.. అంబులెన్స్ కోసమే మహీంద్రా నియోప్లస్ బొలెరో వాహనాన్ని మార్కెట్‌లోకి తీసుకువచ్చామన్నారు. రోగులకు అన్ని రకాల సదుపాయాలు వాహనంలో ఉన్నట్లు తెలిపారు. వాహనం ఎక్స్ షోరూమ్ ధర రూ.13,99,000తో ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షులు మనోరంజన్‌రెడ్డి, కార్యదర్శి అభిషేక్, కోశాధికారి సుమన్, ఎంజీబీ మొబైల్స్ సేల్స్ జీఎం వంశీకృష్ణ, సేల్స్ మేనేజర్ మస్తాన్ వలీఖాన్ పాల్గొన్నారు.

## వృద్ధురాలి చైన్ తెంచుకుపోయారు..

**అనంతపురం క్రైం, ఫిబ్రవరి 10:** అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లి గ్రామంలో శనివారం చైన్‌స్నాచింగ్ చోటుచేసుకుంది. పోలీసుల అందించిన వివరాల మేరకు... అక్కంపల్లిలో నివాసముంటున్న లక్ష్మీనరసమ్మ ఇంట్లో ఉండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి ముందు అటూ ఇటూ తిరుగుతున్నారు. గమనించిన వృద్ధురాలు బయటికి వచ్చి ఎవరి కోసం వెతుకుతున్నారని ఆరా తీసిందన్నారు. ఆ వృద్ధురాలి మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు చైనును లాక్కుని ఆ ఇద్దరు అగంతకులు పరారయ్యారన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

### మేస్త్రీపై బేల్దారి దాడి

**అనంతపురం క్రైం, ఫిబ్రవరి 10:** ఓ మేస్త్రీపై అతని వద్ద పని చేసే బేల్దారి శనివారం దాడికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నగరంలోని రాజీవ్ కాలనీకి చెందిన నూర్ మేస్త్రీగా పని చేసేవాడు. వడ్డే నవీన్ అతనివద్ద బేల్దారిగా పనిచేస్తున్నాడు. ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నూర్‌పై నవీన్ దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


### 13న పారా స్విమ్మింగ్ పోటీలు

**అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 10:** జిల్లా స్థాయి పారా స్విమ్మింగ్ పోటీలు 13వ తేదీన నిర్వహించనున్నట్లు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు తెలిపారు. స్థానిక డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో 13వ తేదీలోపు ఉమ్మడి జిల్లాలోని పారా క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు 21వతేదీ నుంచి విశాఖపట్నంలో నిర్వహించే 5వ రాష్ట్రస్థాయి పారా స్విమ్మింగ్ క్రీడా పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 8074106154ను సంప్రదించాలని కోరారు.

### టీడీపీతోనే బీసీలకు రక్షణ

**అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 10:** తెలుగు దేశం పార్టీతోనే బీసీలకు రక్షణ అని టీడీపీ నాయకులు, కేహెచ్ ఫౌండేషన్ చైర్మన్ నాగభూషణం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం జగన్ అన్ని వర్గాల ప్రజలను నట్టేటముంచాడన్నారు. గత ఎన్నికలకు ముందు మాయమాటలు చెప్పి, అపద్దపు హామీలతో గద్దెనెక్కారన్నారు. బీసీలు ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవాలంటే రాబోవు ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి, చంద్రబాబునాయుడును సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

# ఎందుకీ కష్టాలు..!



- రెవెన్యూ కార్యాలయాల్లో ప్రజలకు డిజిటల్ కీ కష్టాలు
- సర్టిఫికెట్ల జారీకి బ్రేక్

**అనంతపురంరూరల్, ఫిబ్రవరి10:** రెవెన్యూ కార్యాలయంలో ప్రజలను డిజిటల్ కీ కష్టాలు వేధిస్తున్నాయి. అవసరమైన సర్టిఫికెట్లు కావల్సిన వారు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. తహసీల్దార్లు విధుల్లో చేరి వారంరోజులు అవుతున్నా అధికారులకు డిజిటల్ కీ రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో వారం రోజుల కిందట ఉమ్మడి జిల్లాలో తహసీల్దార్లు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. ఈక్రమంలోనే చిత్తూరు, కర్నూలు, కడప నుంచి ఆ ప్రాంతాల్లోని తహసీల్దార్లు జిల్లాకు బదిలీపై వచ్చారు. ఈనెల 5వతేదిన అనంతపురం అర్బన్ తహసీల్దార్‌గా శివరామిరెడ్డి, రూరల్ తహసీల్దార్‌గా టీవీ సుబ్రహ్మణ్యం నాయుడు బాధ్యతలు చేపట్టారు. ఇంత వరకు బాగానే ఉన్నా కొత్త అధికారులకు డిజిటల్ కీ ఇవ్వకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. కొన్ని రోజుల కిందట వరకు అనంతపురం అర్బన్, రూరల్ మండలాలకు ఇద్దరు తహసీల్దార్లు ఉన్నా..ఒకే డిజిటల్ కీపైనే ఉండేదీ. దీంతో అనంతపురం అర్బన్ తహసీల్దార్ తన పరిధిలోని సర్టిఫికెట్లను పూర్తి స్థాయి లో పరిశీలించి సంతకం చేసిన తరువాత రూరల్ తహసీల్దార్ పేరు మీదుగా సర్టిఫికెట్లు జారీ అయ్యేవీ. ప్రస్తుతం వారు బదిలీ అయ్యారు. వారిస్థానంలో వచ్చిన అధికారులకు వేరు..వేరు డిజిటల్ 'కీ'లకు కోసం ఎదురు చూస్తున్నట్లు ఆయా వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈనేపథ్యంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ప్యామిలీ నెంబరు సర్టిఫికేట్ల జారీకి బ్రేక్ పడింది. సర్టిఫికేట్ల కోసం ప్రజలు తహసీల్దార్ కార్యాలయాలు చుట్టూ తిరగక తప్పడం లేదు. దీంతో అత్యవసర సర్టిఫికెట్లు కావల్సిన వారికి ఆవేదన తప్పడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఆయా అధికారులకు డిజిటల్ కీ కేటాయించి సర్టిఫికెట్లు జారీ అయ్యేలా చూడాలని బాధితులు కోరుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయం

## జగన్ అరాచకాలపై లోకేశ్ పూరించిన నాదమే శంఖారావం

- ద్విసభ్యకమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు



**నార్పల, ఫిబ్రవరి 10:** సీఎం జగన్‌రెడ్డి, వైసీపీ నాయకల అరాచకాలపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ పూరించిన నినాదమే శంఖారావం అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ద్విసభ్యకమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు అన్నారు. మండలంలోని బొందలవాడ స్వగృహంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువగళం పాదయాత్రలో లోకేశ్ పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావంతో పర్యటించి జగన్‌రెడ్డి ప్రభుత్వ దౌర్జన్యాలపై ప్రజలకు, కార్యకర్తలకు వివరిస్తారన్నారు. రానున్న 40-50 రోజుల్లో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో లోకేశ్ పర్యటించనున్నారన్నారు. ఒక్క రోజులో మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా కార్యకర్తలు నేరుగా లోకేశ్‌తో తమ అభిప్రాయాలను పంచుకునే అవకాశం ఉంటుందన్నారు.

**రాష్ట్ర ప్రజలకు భరోసా ఇచ్చేందుకే శంఖారావం**

**అనంతపురం రూరల్:** రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించేందుకే జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం కార్యక్రమాన్ని తల



మాట్లాడుతున్న నారాయణస్వామి, టీడీపీ నాయకులు

పెట్టినట్లు తెలుగుయువత రాష్ట్రప్రధాన కార్యదర్శి గడిపూటి నారాయణ స్వామి అన్నారు. శనివారం మండలంలోని పాపంపేటలో ఉన్న టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. జగన్ రెడ్డి, వైసీపీ నాయకులు అరాచకాలకు వ్యతిరేకంగా లోకేశ్ పూరించిన నాదమే శంఖారావం అన్నారు. ఆత్మకూరు మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు లింగమయ్య, దస్తగిరి, నాగార్జున, హరీష్‌రెడ్డి, మద్దినేనికృష్ణ, వేలూరు నవీన్, జెట్టి భరత్, గోపాల్ పాల్గొన్నారు.

**శంఖారావాన్ని విజయవంతం చేయండి**



మాట్లాడుతున్న టీడీపీ మండల నాయకులు

**ఆత్మకూరు:** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ జగన్ రెడ్డి అరాచకాలపై పూరించిన శంఖరావ కార్యక్రమాన్ని విజయవంతం కావాలని మండల ఆ పార్టీ నాయకులు ఆకాంక్షిచారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. లోకేశ్ పాదయాత్రతో ఎంతో ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారని, ప్రజలకు భరోసా కల్పించేందుకే శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల మాజీ కన్వీనర్‌లు వెంకటనరాయణ, సూరి, ఎస్టీ సెల్ నాయకులు వెంకటేసులు, పూల ఓబులపతి, ఆదెప్ప బొమ్మయ్య, పోతన్న, నరసింహులు, గోపి, పోతన్న, లక్ష్మిదేవి, చెన్నమ్మ పాల్గొన్నారు.

## హామీలను తుంగలో తొక్కిన ఘనత జగన్‌దే

- జనసేన రాయలసీమ రీజనల్ ఉమెన్ కోఆర్డినేటర్ శ్రీలత



మహిళలతో సమస్యలు తెలుసుకుంటున్న పెంద్యాల శ్రీలత

**అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 10:** ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత తుంగలో తొక్కిన ఘనత జగన్‌కే దక్కుతుందని జనసేన పార్టీ రాయలసీమ రీజనల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెంద్యాల శ్రీలత మండిపడ్డారు. శనివారం ఆమె మహిళలతో మాటామంతి కార్యక్రమంలో భాగంగా 1వ డివిజన్‌లోని మహాత్మాగాంధీ కాలనీలో పర్యటించారు. మహిళలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ... అమ్మఒడి, మద్య నిషేధం, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ తదితర హామీలను సీఎం నెరవేర్చలేదన్నారు. 1వ డివిజన్‌లో వైసీపీ నాయకుల వేధింపులతో మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. నీటి ఎద్దడి తీవ్రస్థాయిలో ఉందన్నారు. డివిజన్‌లో సమస్యలు రాజ్యమేలుతున్నా... ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. ఆ పార్టీ వీర మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**వైసీపీని గద్దె దించడమే లక్ష్యం**

**గార్లదిన్నె:** రాష్ట్రంలో వైసీపీని గద్దె దించడమే జనసేన పార్టీ లక్ష్యమని శింగనమల నియోజకవర్గ ఇన్‌చార్జి సాకే మురళీకృష్ణ అన్నారు. మండలంలోని మర్తాడు గ్రామంలో శనివారం జనసేన మండల కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు పార్టీలో గుర్తింపు లభిస్తుందన్నారు. టీడీపీ, జనసేన అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా గెలుపే ధ్యేయంగా శ్రమించాలని సూచించారు. జిల్లా ఉపాధ్యక్షులు అంకె ఈశ్వరయ్య, జిల్లా సంయుక్త కార్యదర్శి దివే కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి చొప్పచంద్ర, మండల అధ్యక్షులు తాతయ్య, ఉపాధ్యక్షులు సోమశేఖర్, రాఘవేంద్ర, మహిళానేతలు శశిరేఖ, గోగుల సునీత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీకృష్ణ

## ఎన్నికల సిబ్బంది ఎంపిక కసరత్తు పూర్తి

- సీఎఫ్‌ఎంఎస్ ద్వారా టీచర్ల సమాచారం సేకరణ
- మూడు రోజుల్లో పీఓ, ఏపీఓ, ఓపీఓలకు ఉత్తర్వులు

**అనంతపురం టౌన్, ఫిబ్రవరి 10:** సార్వత్రిక ఎన్నికలకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమౌతోంది. ఇప్పటికే సెక్టోరియల్, పోలీసు అధికారుల ఎంపిక పూర్తి అయ్యింది. పోలింగ్ కేంద్రాలు, ఓటర్లకు వసతులు, సరిహద్దు ప్రాంతాలలో నిఘా, సమస్యాత్మక ప్రాంతాలలో బందోబస్తు తదితర అంశాలపై వీరికి శిక్షణ ఇచ్చారు. తాజాగా ఎన్నికల నిర్వహణకు క్షేత్రస్థాయిలో పని చేసే పీఓ, ఏపీఓ, ఓపీఓల ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఈ జాబితాలో ఉపాధ్యాయవర్గమే ఎక్కువగా ఉంది. విద్యాశాఖ నుంచి మొదట వీరి వివరాలను తీసుకున్నారు. అనంతరం సీఎఫ్‌ఎంఎస్ ద్వారా జీతాలు తీసుకుంటున్న ఉపాధ్యాయుల వివరాలను ట్రెజరీ నుంచి తీసుకున్నారు. మండలాల వారీగా పాఠశాలలు, వాటి కోడ్ తీసుకున్నారు. ఎన్ఐసీ సెంటర్‌లో కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి, స్కూల్ కోడ్ ఆధారంగా ఉపాధ్యాయుల వివరాలను తీసుకుంటున్నారు. ప్రభుత్వ, మున్సిపల్, జడ్పీ, మండల పరిషత్, మోడల్ స్కూల్స్, కేజీబీవీలలో పనిచేస్తున్న టీచర్లందరికీ ఎన్నికల విధులను కేటాయిస్తున్నారు. మొత్తం మీద 10 వేల మందికి పైగా ఉపాధ్యాయులు ఉన్నారని అధికారులు చెబుతున్నారు.



ఎన్ఐసీ సెంటర్‌లో ఎన్నికల సిబ్బంది నియామకంలో నిమగ్నమైన అధికారులు

ఉపాధ్యాయుల జీతాల స్కేల్ ఆధారంగా ఎన్నికల విధులను కేటాయిస్తున్నారు. ఈసారి ఎన్నికల విధుల కేటాయంపు విషయంలో కొత్త నిర్ణయం తీసుకున్నారు. ఎక్కడ పనిచేస్తున్నారు, నివాసం ఎక్కడ, ఓటు హక్కు ఏ ప్రాంతంలో ఉందో గమనించి, విధులను కేటాయిస్తున్నారు. ఎపిక్ నంబర్ ఆధారంగా వివరాలను సేకరించి, పీఓ, ఏపీఓలు, ఓపీఓలుగా నియమిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తి అయ్యింది. ఇతర ఉద్యోగులకు కూడా ఇదే పద్ధతిలో నియమిస్తున్నారు. ఏ ఒక్క ఉద్యోగి ఎన్నికల విధుల నుంచి తప్పించుకునేందుకు వీలు ఉండదని అంటున్నారు. ఎన్నికల నిబంధనల మేరకు కొందరికి మినహాయింపు ఇస్తారు. ఆయా శాఖల అధికారులకే ఈ బాధ్యతలను అప్పగించారు. మూడు రోజుల్లో పీఓ, ఏపీఓ, ఓపీఓలకు ఉత్తర్వులు పంపడం ప్రారంభిస్తారు. ఆ తర్వాత వీరికి ఎన్నికల నిర్వహణపై రెండు మూడు దఫాలుగా శిక్షణ ఇస్తారు.

## ఎండిన వేరుశనగ పంట పరిశీలన



కాయలు లేని పైరును చూపుతున్న పరిటాల సునీత

**రామగిరి, ఫిబ్రవరి 10:** మండలంలోని కొత్తగాదికుంట గ్రామంలో ఓ రైతు వేరుశనగ పంట కోస్తుండగా ఆ పంటను శనివారం మాజీ మంత్రి పరిటాలసునీత పరిశీలించారు. స్థానిక నాయకులతో కలిసి ఆమె రైతు నడిమింటి శివ పొలానికి వెళ్లి పంట సాగుపై ఆరాతీశారు. నాలుగు ఎకరాల్లో పంటను సాగుచేశానని, దిగుబడి ఏ మాత్రం లేకపోవడంతో పశుగ్రాసానికైనా ఉపయోగపడుతుందని పంటను తొలగిస్తున్నట్టు తెలిపాడు. నష్టపోయిన రైతుకు ప్రభుత్వం పరిహారం అందించాల్సిన అవసరం ఉందని, ఇలా చాలా మంది రైతులు దిగుబడులు లేక నష్టాల్లో కూరుకుపోయారని పరిటా సునీత అన్నారు.

**టీడీపీ నాయకుడి మృతికి నివాళి**

మండలంలోని పీఆర్ కొట్టాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వడ్డెవెంకటరాముడు అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పరిటాలసునీత శనివారం గ్రామానికి వెళ్లి ఆయన భౌతికకాయంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మండల కన్వీనర్ సుధాకర్, రామ్మూర్తినాయుడు, ఎంపీటీసీ శ్రీనివాసులు, మాదాపురం శంకర్, శ్రీధర్‌నాయుడు, పోతన్న, వెంకటరాముడు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు కేంద్రం మద్దతు హర్షణీయం



మాట్లాడుతున్న బండారు శంకర్

**అనంతపురం విద్య, ఫిబ్రవరి 10:** ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌కు కేంద్రం మద్దతు తెలపడం హర్షణీయమని ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధానకార్యదర్శి బండారు శంకర్ అన్నారు. శనివారం ఉపాధ్యాయభవన్‌లో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది నవంబరు 11న హైదరాబాద్‌లో జరిగిన మాదిగల విశ్వరూప మహాసభకు ప్రధాని మోదీ హాజరై..మాదిగలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారన్నారు. కేంద్ర కేబినెట్ సెక్రటరీ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయించారన్నారు. ఎస్సీ వర్గీకరణపై 6, 7, 8 తేదీల్లో సుప్రీం కోర్టులో కేంద్రం తరపున అటార్నీ జనరల్ వెంటక రమణను, భారత సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాని పంపి వర్గీకరణకు అనుకూలంగా ధర్మాసనం ముందు అభిప్రాయం వ్యక్తం చేయడం ఆనందంగా ఉందన్నారు. సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు రమేష్, యల్లప్ప, గంగాధర్, నాగేంద్ర, అశోక్, హనుమంతరావు, దేవర పుల్లన్న, సాకే నరసింహులు, నాగభూషణ్, రాయుడు, నారాయణస్వామి, శ్రీనివాసులు, ప్రసాద్, హరికృష్ణ, అనిల్‌కుమార్, గంగాధర్, సుబ్బన్న పాల్గొన్నారు.

## జయహో బీసీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



కనగానపల్లిలో సభాస్థలిని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

**ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 10:** కనగానపల్లి మండలకేంద్రంలో తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే జయహో బీసీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండలకన్వీనర్ యాతం పోతులయ్య పిలుపునిచ్చారు. శనివారం కనగానపల్లిలోని పార్టీకార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ బీసీలను చైతన్యపరిచి న్యాయం చేసేందుకు జయహో బీసీ కార్యక్రమం చేపడుతున్నామని, కార్యక్రమానికి మాజీమంత్రి పరిటాలసునీత ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. కనగానపల్లి బీసీ కాలనీ కొట్టాల శివాలయం వద్ద నుంచి భారీ బైకుర్యాలీ నిర్వహిస్తామని, కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం నాయకులతో కలిసి బీసీ కార్యక్రమానికి కనగానపల్లిలోని గ్రామీణ బ్యాంకు ఎదుట స్థలపరిశీలన చేశారు.

## ఎమ్మెల్యే చిన్నాన్నపై చర్యలు తీసుకోవాలి

- వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల డిమాండ్



వైసీపీ నాయకుడి తప్పుడు బిల్లులు చూపుతున్న నాయకులు

**శింగనమల, ఫిబ్రవరి 10:** ఎమ్మెల్యే జొన్నలగడ్డల పద్మావతి చిన్నాన్న బొమ్మన శ్రీరాంరెడ్డి ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతికి పాల్పడ్డాడని, అయనపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి, కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శనివారం శింగనమల రామస్వామి దేవాలయంలో ఉపాధి హామీ పథకంలో ఎమ్మెల్యే చిన్నాన్న శ్రీరాంరెడ్డి తప్పుడు పద్ధతిలో బిల్లులు పొందిన వివరాలను విలేకరులకు వివరించారు. వారు మట్లాడుతూ వైసీపీ మండల నాయకుడు ఎమ్మెల్యే పద్మావతి, చిన్నాన, భర్త ఆలూరు సాంబశివారెడ్డి మేనమామ శ్రీరాంరెడ్డితోపాటు ఆయన భార్య ఓబుళమ్మ పేరు మీద ఉపాధి పనులకు పోకపోయినా బిల్లులు చేశారని ఆరోపించారు. తమకు సంబధంలేని భూములు మీద హార్టికల్చర్ ప్లాంటేషన్ చేసినట్లు, సాంబశివారెడ్డి పేర్ల ఉన్న భూమిని కూడా తమ పేర్ల మీద చూపి బిల్లులు చేసుకున్నారన్నారు. సొదనపల్లిలో లేని రెవెన్యూ పొలం సర్వే నెం.1801-1 వేసి బిల్లు తీసుకున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు, అప్పటి ఎంపీడీఓ శ్రీరాంరెడ్డికి తొత్తుగా మారినట్లు ఆరోపించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగలింగమయ్య, ఎర్రిస్వామి, శ్రీనివాసులు గిరి, పుల్లన్న పాల్గొన్నారు.

## ప్రభుత్వం వెంటనే ఐఆర్ ప్రకటించాలి : పీఆర్టీయూ



మాట్లాడుతున్న పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య

**అనంతపురం విద్య, ఫిబ్రవరి 10 :** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఐఆర్ ప్రకటించాలని పీఆర్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆ సంఘం ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యవర్గ సమావేశం నగరంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో నిర్వహించారు. సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ... డీఎస్సీ - 2024 నోటిఫికేషన్‌లో ఇచ్చినట్లుగా అప్రెంటిస్ విధానాన్ని తొలగించాలన్నా రు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి గిరిప్రసాద్ మాట్లాడుతూ.... పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని, 2003 ఏడాదికి ముందు ఎంపికైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ స్కీం వర్తింపజేయాలని కోరారు. పాఠశాలలకు గ్రాం టు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి తిమ్మారెడ్డి, ఇతర రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, రజనీకాంత్, సుగుణమ్మ, దామోధర్, ఉమామహేష్, రామకృష్ణ, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

### జీడిపల్లికి 735 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

**బెళుగుప్ప, ఫిబ్రవరి 10:** మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు శనివారం 735 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు శనివారం వెల్లడించారు. ఔట్‌ఫ్లో700 క్యూసెక్కులుండగా ప్రస్తుతం రిజర్వాయరులో 0.477 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

### వ్యవసాయానికి విద్యుత్ 7గంటలే

**యల్లనూరు, ఫిబ్రవరి10:** మండలంలో వ్యవసాయానికి అందించే విద్యుత్ వేళల్లో మార్పులు జరిగిన ట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. గతంలో 9గంటలు ఇస్తుండగా సోమవారం నుంచి 7గంటలు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. పెద్దమల్లేపల్లి, నిట్టూరు ఫీడర్‌కు ఉదయం 6గంటల నుంచి 1గంటల వరకు తిరుమలాపురం యల్లనూరు ఫీడర్‌కు ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు.

### నేటి నుంచి తిరునాళ్ల

**పెద్దపప్పూరు, ఫిబ్రవరి 10:** మండలంలోని చిన్న పప్పూరు గ్రామ సమీపంలో వెలసిన అశ్వత్థ నారాయణస్వామి, శ్రీచక్ర స్థాపిత భీమలింగేశ్వరస్వామి ఆలయ తిరునాళ్ల ఆదివారం నుంచి ప్రారంభం అవుతుందని ఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. మాఘమాసం పురస్కరించుకొని ఐదు ఆదివారాలపాటు తిరునాల జరగనుంది.

## మాఘం... సకల శుభాల మాసం



- ప్రారంభమైన మాఘమాసం

**అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 10:** పూజలు... ఇళ్లలో శుభకార్యాలు వంటివాటికి పెట్టిందిపేరు మాఘమాసం. వీటిలో ప్రధానంగా వివాహాలకు శుభప్రదమైన మాసంగా పేర్కొంటుంటారు. పురాణాల్లోనూ మాఘమాసానికి విశేష ప్రాశస్త్యం ఉంది. త్రేతాయుగంలో రామసేతును మొదలుపెట్టింది, ద్వాపర యుగం ఆరంభమైంది కూడా ఈ మాసంలోనేనని పురాణాలు చెబుతున్నాయి. చాంద్రమానం ప్రకారం చంద్రుడు పౌర్ణమినాడు ఏ నక్షత్రంలో ఉంటే ఆ మాసానికి ఆ నక్షత్రం పేరు వర్తిస్తుంది. పౌర్ణమినాడు మఘ నక్షత్రం ఉండటం వల్ల ఈ మాసానికి మాఘ మాసం అని పేరు వచ్చింది. శూన్య పుష్యమాసం తర్వాత వచ్చే కల్యాణ కారక మాసం ఇది. అందుకే ఈ మాసంలో వివాహాలు నిర్వహించేందుకు అనేకమంది నెలలతరబడి ఎదురుచూస్తుంటారు. వైశాఖ, కార్తీక మాసాల తరహాలోనే ఈ మాఘమాసంలోనూ స్నానాదులకు అధిక ప్రాధాన్యతనిస్తుంటారు. శనివారం నుంచి మాఘమాసం ఆరంభమైన నేపథ్యంలో ప్రతి ఇల్లు సందడిగా మారనుంది. ఈ మాసంలో శుభముహూర్తాలుండడంతో వేలాది వివాహాలు, గృహప్రవేశాలు, అక్షరాభ్యాసాలు, నామకరణం వంటి శుభాకార్యాలూ జరగనున్నాయి.

**మాఘస్నానాలు శుభప్రదం...**



తెలిసీ తెలియక చేసిన పాపదోషాలు తొలగించుకునేందుకు మాఘస్నానాలు శుభప్రదం. ఈ మాసంలో చేసే నదీస్నానం వల్ల శుభఫలితాలు కలుగుతాయి. ఈ మాసంలో వచ్చే ప్రతిరోజూ ఒకో విశిష్టతను కలిగి ఉన్నాయి. ఈ నెల 11, 12, 14, 16, 21, 22, 28, 29, మార్చి 6, 8వ తేదీలు వివాహాలకు అత్యంత శుభప్రదమైన రోజులు. వీటిలో మరీ ముఖ్యంగా 14, 29వ తేదీలు బలమైన ముహూర్తాలున్నందున ఈ తేదీల్లో వేలసంఖ్యలో వివాహాలు జరిగే అవకాశముంది.

**- ఆలూరు లక్ష్మీనరసింహశాస్త్రి, పురోహితుడు**

## జీడిపల్లికి 735 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

**బెళుగుప్ప, ఫిబ్రవరి 10:** మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు శనివారం 735 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు శనివారం వెల్లడించారు. ఔట్‌ఫ్లో700 క్యూసెక్కులుండగా ప్రస్తుతం రిజర్వాయరులో 0.477 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

## వ్యవసాయానికి విద్యుత్ 7గంటలే

**యల్లనూరు, ఫిబ్రవరి10:** మండలంలో వ్యవసాయానికి అందించే విద్యుత్ వేళల్లో మార్పులు జరిగినట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. గతంలో 9గంటలు ఇస్తుండగా సోమవారం నుంచి 7గంటలు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. పెద్దమల్లేపల్లి, నిట్టూరు ఫీడర్‌కు ఉదయం 6గంటల నుంచి 1గంటల వరకు తిరుమలాపురం యల్లనూరు ఫీడర్‌కు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు.

## బీజేపీ 'పల్లెకు పోదాం'

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 10:** మండలంలోని తలారిచెరువు, ఊరుచింతల గ్రామాల్లో శనివారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని స్థానిక బీజేపీ నాయకులు నిర్వహించారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని వారు కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శింగరి లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

**పుట్లూరు:** మండలంలోని మడ్డిపల్లి, కొండుగారి కుంట, ఎల్లుట్ల గ్రామాల్లో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను నాయకులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రామాంజియాదవ్, నాయకులు నరసింహారెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

## నేడు ఘంటసాల వర్ధంతి

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి10:** పట్టణంలోని మార్కండేయస్వామి ఆలయంలో ఆదివారం సంగీత దిగ్గజం ఘంటసాల 50వ వర్ధంతి నిర్వహించనున్నారు. సాయంత్రం పాడుతా తీయగా చల్లగా సినీ సంగీత విభావరిని నిర్వహిస్తున్నట్లు మహేష్ స్వామి తెలిపారు.

## ఆర్చ్ నిర్మాణ పనులు ప్రారంభం

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 10:** పట్టణంలోని నెహ్రూ పార్క్ సమీపంలో బుగ్గరామలింగేశ్వరస్వామి ఆర్చ్ నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. వారం రోజులపాటు శివాలయం వీధిని మూసివేయనున్నట్లు తెలిపారు. దీనికి బదులుగా ప్రత్యామ్నాయ మార్గాల్లో ఆలయానికి, శివాలయం వీధిలోకి వెళ్లాలని సభ్యులు కోరారు.

## నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 10:** మండలంలోని కడప రోడ్డులో ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో శనివారం నలుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.4670 స్వాధీనం చేసుకున్నామని రూరల్ పోలీసులు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశామన్నారు.

## హంద్రీనీవాలో యువకుడి గల్లంతు

**ఉరవకొండ, ఫిబ్రవరి 10:** మండలంలోని కౌకుంట్ల గ్రామ సమీపంలోని హంద్రీనీవా కాలువలో మస్తాన్ వలి అనే యువకుడు శనివారం గల్లంతయ్యాడు. గుంతకల్లుకు చెందిన మస్తాన్‌వలి కౌకుంట్లలో బంధువుల ఇంటికి వచ్చాడు. కాలువలోకి ఈతకు వెళ్లిన సమయంలో గల్లంతయ్యాడు. బంధువులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపుచర్యలు చేపట్టారు.

## సిమెంట్ రోడ్డు ప్రారంభం

**తాడిపత్రి, ఫిబ్రవరి 10:** మండలంలోని బుగ్గ గ్రామంలో శనివారం అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ లిమిటెడ్ హెచ్‌ఆర్ బృందం, సీఎస్‌ఆర్ సిబ్బంది కలిసి సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. సీఎస్‌ఆర్ నిధుల ద్వారా రూ.15లక్షలతో రోడ్డు పనులను ప్రారంభించామని సిబ్బంది తెలిపారు.

## నేటి నుంచి తిరునాళ్ల

**పెద్దపప్పూరు, ఫిబ్రవరి 10:** మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలో వెలసిన అశ్వత్థ నారాయణస్వామి, శ్రీచక్ర స్థాపిత భీమలింగేశ్వరస్వామి ఆలయ తిరునాళ్ల ఆదివారం నుంచి ప్రారంభం అవుతుందని ఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. మాఘమాసం పురస్కరించుకొని ఐదు ఆదివారాలపాటు తిరునాల జరగనుంది.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**గుత్తి, ఫిబ్రవరి10:** పట్టణ శివారు కర్నూలు రోడ్డులో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో ఇద్దరు శనివారం తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక బెస్త వీధికి చెందిన ఈశ్వర్, భీమా అనే యువకులు ద్విచక్రవాహనంపై కర్నూలు గేట్ వైపు వస్తుండగా మోడల్ స్కూల్ సమీపంలో అదుపు తప్పి కింద పడ్డారు. గాయపడిన వీరిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురంకు తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**గుమ్మఘట్ట/డీ.హీరేహాళ్, ఫిబ్రవరి 10:** మహాత్మా జ్యోతిబాఫూలే బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు తెలియజేశారు. 2024-25 విద్యాసంవత్సరంలో ఇంగ్లిష్ మీడియంలో ఐదో తరగతి చేరదలచిన వారికి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలకు మార్చి 1 నుంచి మార్చి 31వ తేదీ వరకు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## తాడిపత్రి సీఐ బాధ్యతల స్వీకరణ

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 10:** పట్టణ సీఐగా మురళీకృష్ణ శనివారం బాధ్యతలు చేపట్టారు. కొన్ని నెలలుగా సీఐ స్థానం ఖాళీగా ఉండటంతో అనంతపురం వీఆర్‌లో ఉన్న మురళీకృష్ణ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణ సీఐగా బాధ్యతలు చేపట్టారు.

## శ్రీశైలం ఆలయ ఈఓను సస్పెండ్ చేయాలి

**గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 10:** ప్రసిద్ధి చెందిన శ్రీశైలం ఆలయంలో అమ్మవారి ప్రసాదంలో ఎముకలు రావటానికి కారకులైనవారిని, నిర్లక్ష్యం ప్రదర్శించిన ఆలయ ఈఓను వెంటనే సస్పెండ్ చేయాలని వీహెచ్‌పీ బజరంగ్‌దళ్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక వీహెచ్‌పీ కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రసాదం తయారు చేసే వారిని, ఆలయ పర్యవేక్షణ చేసే ఈఓ, ఏఈఓపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆలయంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో భజరంగ్‌దళ్ రాష్ట్ర సాప్తమిక్ కన్వీనర్ కసాపురం రవి, సేవా ప్రముఖ్ బండిమురళి, గోరక్షప్రముఖ్ భీమాయాదవ్, సభ్యులు దాసరి శ్రీనివాసులు, నారాయణరెడ్డి, మోహన్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు

**- గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్**



జక్కలచెరువులో మహిళలకు కరపత్రాన్ని అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్

**గుత్తిరూరల్, ఫిబ్రవరి 10:** చంద్రబాబు నాయుడు మరో సారి సీఎం అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ పేర్కొన్నారు. మండలంలోని జక్కల చెరువు గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ వైసీపీ పాలనలో గ్రామాలు ఏమాత్రం అభివృద్ధి చెందలేదన్నారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు హరినాథ గౌడ్, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి పవన్‌గౌడ్, టీడీపీ సీనియర్ నాయకులు అనిల్ కుమార్ గౌడ్, విష్ణువర్ధన్ గౌడ్, మండల, కన్వీనర్లు బర్దీవలి, మాజీ ఎంపీపీ వీరేష్, ఎంపీటీసీ జింకల నారాయణస్వామి, మాజీ ఎంపీటీసీ వెంకటనారాయణ, మాజీ సర్పంచులు, లక్ష్మీనారాయణమ్మ, రామాంజనేయులు, సుధీర్‌గౌడ్, ప్రతాప్, సాంబశివ, గొందిపల్లి శివశంకర్, నారాయణస్వామి, అగ్గిరాముడు, మాబు, సూరి, చంద్ర,హనుమంతురెడ్డి పాల్గొన్నారు.

### డీఎస్పీని కలిసిన జితేంద్రగౌడ్

**గుంతకల్లుటౌన్:** డీఎస్పీగా బాధ్యతలను స్వీకరించిన శివ భాస్కర్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీకి పూలబొకేను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డీఎస్పీ బంగ్లాలో బదిలీ అయిన డీఎస్పీ నరసింగప్పనుకూడా మర్యాద పూర్వకంగా కలిశారు. డీఎస్పీని కలిసిన వారిలో టీడీపీ నాయకులు రాయల రామయ్య, కేశప్ప, రామన్నచౌదరి, చలపతి, కురుబశివన్న, పీకేసీ గోపాల్, రాయల్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీని భూస్థాపితం చేయడానికే శంఖారావం: ఉమా



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరనాయుడు

**కళ్యాణదుర్గం రూరల్, ఫిబ్రవరి 10:** వైసీపీ పాలనను భూస్థాపితం చేసేందుకే నారా లోకేశ్ శంఖారావానికి శ్రీకారం చుట్టినట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లల్లో చేసిన అవినీతి, అక్రమాలపై ప్రతిపక్ష పార్టీగా తెలుగుదేశం పార్టీ పోరాడుతూనే ఉందన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ యువగళం పేరుతో పాదయాత్రను మొదలుపెడితే, అడుగడుగునా అడ్డంకులు సృష్టించిందన్నారు. యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ యువత, నిరుద్యోగులతో ముఖాముఖిగా చర్చించి, వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారని పేర్కొన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సైతం బాదుడే-బాదుడు, ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి వంటి సభలు, సమావేశాలు నిర్వహించి వైసీపీ అవినీతిని కడిగి పారేశారన్నారు. సమావేశంలో దొడగట్ట నారాయణ, తలారి సత్తి, కొల్లప్ప, రామరాజు, డిష్ మురళి, బిక్కి గోవిందరాజులు, విరుపాక్షి, నగేష్ యాదవ్, పాలబండ్ల శ్రీరాములు, కొల్లప్ప, కామక్కపల్లి నాగరాజు, లింగా సురేంద్ర, రమేష్ యాదవ్, రోషన్ వలీ, వడ్డె నాగరాజు, హనుమంతరాయుడు, ఎరుకుల హరి తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ పాలనలో తాగునీటికి కటకట



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

**బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 10:** గ్రామాల్లోని ప్రజలకు కనీసం తాగునీరు ఇవ్వలేని స్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందని టీడీపీ నాయకులు విమర్శించారు. మండలంలోని గోవిందయ్యదొడ్డి గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. చీరలు కూడా అందజేశారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరాయచౌదరి ఆదేశాల మేరకు ఈ గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు హనుమంతరాయచౌదరి కోడలు ఉన్నం వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీతోనే దేశాభివృద్ధి



బెళుగుప్పలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

**బెళుగుప్ప, ఫిబ్రవరి 10:** బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఉరవకొండ నియోజకవర్గం ఇన్‌చార్జ్ కొనకొండ్ల రాజేష్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ సారథ్యంలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వన్నూరుస్వామి, మనోహర్, ఆంజనేయులు, మహేంద్ర పాల్గొన్నారు.

## కళాకారుడికి సత్కారం

**పామిడి, ఫిబ్రవరి 10:** పట్టణంలోని స్వరరాగ నాటక కళాసమితిలో శనివారం కళాకారుడు యం దేవరాజును ఇతర కళాకారులు ఘనంగా సత్కరించారు. గుంటూరు జిల్లా పొన్నేకల్లులో పద్మశ్రీ బుర్రకథ పితామహుడు నాజర్ 104వ జయంతి ఉత్సవాల్లో కళాకారులకు ఉచిత శిక్షణ ఇచ్చి కళాభివృద్ధికి కృషి చేసిన దేవరాజును వారు ఘనంగా సన్మానించారు. దేవరాజు ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ఉత్సవాల్లో ప్రతిభకనపరస్తూ సత్కారం పొందిన కళాకారున్ని సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందని కళాకారులు అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కళాకారులు వీసీ రత్నరాజు, పుంజా కృష్ణారావుయాదవ్, సుబ్రహ్మణ్యం, నాగరాజు పాల్గొన్నారు.

## ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

**రాయదుర్గం, ఫిబ్రవరి 10:** ముందస్తు అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొట్రేష్ పేర్కొన్నారు. మెగా డీఎస్సీ విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 11న ఏఐవైఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో విద్యార్థి సంఘం నాయకులకు నోటీసులు ఇవ్వడం సబబు కాదన్నారు. ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీస్ ముట్టడికి వెళ్లకుండా ముందస్తుగా శనివారం నోటీసులు అందజేశారు. ఈక్రమంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల పట్ల నిర్దయగా వ్యవహరిస్తున్న ఈ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామన్నారు. దశలవారీగా ఉద్యమాలు చేపడతామని నిరుద్యోగుల పక్షాన నిలబడతామని వెల్లడించారు. తాలూకా కార్యవర్గ సభ్యులు యోగేంద్ర, తాలూకా నాయకులు దినకర్‌తేజకు పోలీసులు నోటీసులు అందజేశారు.

## రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న పెన్షనర్ అసోసియేషన్ నాయకుడు

**గుత్తి, ఫిబ్రవరి10:** రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు రైల్వే పెన్షనర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దేవప్రకాశం పేర్కొన్నారు. గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వే పెన్షనర్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే ఉద్యోగులు చనిపోయిన తరువాత భార్యకు నెలలోపే పెన్షన్ మంజూరు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు అబ్దుల్ మజిద్, మోహన్, ఫక్కీరప్ప, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## 108 వాహనం ఢీ.. ఒకరి మృతి

**కళ్యాణదుర్గం రూరల్, ఫిబ్రవరి 10:** మండలంలోని ఒంటిమిద్ది గ్రామ సమీపంలో శనివారం రాత్రి 108 వాహనం ఢీ కొట్టడంతో అదే గ్రామానికి చెందిన శివ (38) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు తన ఇంటికి వెళ్లేందుకు శివ రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు 108 వాహనం ఢీ కొట్టింది. కళ్యాణదుర్గం నుంచి అనంతపురానికి 108లో రోగులను తీసుకెళ్తున్న సమయంలో దారిమధ్యలోని ఒంటిమిద్ది గ్రామం వద్ద ఈ సంఘటన చోటు చేసుకుంది. మృతుడికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఇసుక తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్థులు

**రాయదుర్గం, ఫిబ్రవరి 10:** మండలంలోని జుంజురంపల్లి గ్రామం వద్ద వేదావతి హగరిలో ఏర్పాటు చేసిన రీచ్‌లో ఇసుక తవ్వకాలను గ్రామస్థులు శనివారం అడ్డుకున్నారు. మూడురోజుల నుంచి రీచ్‌లో ఇసుక తవ్వకాలు నిలిపివేయాలంటూ నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు. వేసవి కాలంలో నీరు తగ్గుముఖం పట్టినట్లు తెలిపారు. ఇలాగే మూడునెలలపాటు ఇసుక తవ్వకాలు జరిపితే తాగడానికి కూడా నీరు కూడా దొరక్కుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఇసుకరీచ్‌ను నిలిపివేయాలని వారు ఆరోపించారు.

# నరసాపురంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'



ఆర్థికసాయం అందజేస్తున్న జేసీ అస్మిత్‌రెడ్డి

**పెద్దపప్పూరు, ఫిబ్రవరి10:** మండలం లోని నరసాపురం గ్రామంలో శనివారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేసీ అస్మిత్ రెడ్డి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికి తిరిగి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టీడీపీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. పలువురు చేనేత కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే చేనేతలకు గిట్టుబాటు ధరను కల్పిస్తామని ఆయన తెలిపారు. ఆయన వెంట జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి, బీసీ రామకృష్ణారెడ్డి, గుర్తి రఘునాయుడు, భాస్కర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నారాయణస్వామియాదవ్, కార్యకర్తలు ఉన్నారు.

### తాడిపత్రి 34వ వార్డులో పర్యటన

**తాడిపత్రి:** పట్టణంలోని 34వవార్డులో టీడీపీ ఇన్‌చార్జ్ జేసీ అస్మిత్‌రెడ్డి శనివారం పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలకు అందుతున్న ప్రభుత్వ పథకాల గురించి ఆరాతీశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మేనిఫెస్టో కరపత్రాలను అందజేస్తూ టీడీపీని గెలిపించాలని కోరారు. ఆయన వెంట 30వవార్డు కౌన్సిలర్ విజయ్ కుమార్‌ఉన్నారు.

● పట్టణంలోని 36వ వార్డులో ఇళ్లు కాలిపోయిన అరిఫాకు జేసీ అస్మిత్‌రెడ్డి శనివారం రూ.25వేలు ఆర్థికసాయం అందించారు. మార్కెట్‌యార్డు వద్ద వలం టీర్ కల్యాణ్‌కు చెందిన చిల్లర అంగడి బంకులో దొంగలుపడి గ్యాస్ స్టౌ, సిలిండర్, ఇతర సామగ్రిని దొంగిలించారు. విషయం తెలుసుకున్న జేసీ అస్మిత్‌రెడ్డి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

## అర్ధరాత్రి అగ్నికి ఎద్దు ఆహుతి

**కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 10:** గుర్తు తెలియని వ్యక్తులు వరి గడ్డికి నిప్పు పెట్టడంతో ఓ ఎద్దు దహనమైపోయిన సంఘటన మండలకేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. కంబదూరులోని గుండ్లపల్లి కాలనీలో నివాసం ఉంటున్న తండ్రీకొడుకులు దళిత జయచంద్ర, ప్రవీణ్ వారం కిందట రూ. 1.5 లక్షలు విలువ చేసే కాడెద్దులను కొనుగోలు చేశారు. వాటితో వ్యవసాయ పనులు చేసేవారు. రోజులాగానే శుక్రవారం రాత్రి కూడా తమ ఇంటి సమీపంలో ఉన్న కోళ్లఫారం షెడ్డులో ఆ రెండు ఎద్దులను కట్టేసి, వరిగడ్డి మేతగా వేసి వచ్చారు. ఆఫారంలోనే 10 ట్రాక్టర్ల వరిగడ్డి కూడా ఉంది. అర్ధరాత్రి సమయంలో విపరీతమైన మంటలు వ్యాపిస్తూ, దట్టమైన పొగలు వచ్చాయి. వెంటనే చుట్టుపక్కల వాళ్లు గమనించి చెప్పడంతో తండ్రీకొడుకులు అక్కడికి పరిగెత్తారు. ఫారంలో ఉన్న వరిగడ్డికి గుర్తుతెలియని దుండగులు నిప్పుపెట్టడంతో మంటలు పూర్తిగా వ్యాపించాయి. ఆ మంటల్లో చిక్కుకున్న ఎద్దులు భయంకరంగా అరిచాయి. ఎద్దులను కాపాడేందుకు తండ్రీకొడుకులు శతవిధాల ప్రయత్నించినా ఓ ఎద్దును కాపాడలేకపోయారు. మరో ఎద్దు చిన్న గాయాలతో బయటపడింది. ఆ మంటల్లో 10 ట్రాక్టర్ల వరిగడ్డి, ఒక ఎద్దు, కోళ్ల ఫారం పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ. 10 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించింది. శనివారం తెల్లవారుజామున అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు.



ఫారంలో కాలిపోయిన గడ్డి, ఇన్‌సెట్‌లో స్వల్పంగా గాయపడిన ఎద్దు

## బ్రహ్మంగారి ఆలయాన్ని దర్శించుకున్న కాలవ



స్వామిని దర్శించుకుంటున్న కాలవ శ్రీనివాసులు

**కణేకల్లు, ఫిబ్రవరి 10:** మండల కేంద్రంలోని కొత్తకొట్టాలలో గల వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాన్ని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు శనివారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఆలయానికి చేరుకుని ప్రత్యేకపూజలు జరిపించారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ లాలెప్ప, ఆనంద్‌రాజ్, వేలూరు మరియప్ప, కోకుర్తి సుదర్శన్, ఆది, ఎస్‌కే మల్లికార్జున, బీటీ రమేష్, కురుబ నాగరాజు, చంద్రశేఖర్‌గుప్తా, శరభనగౌడ్, అశోక్, నరేష్, ఎంపీటీసీ నరేంద్ర, జయరాంచౌదరి, వరుణ్, చాంద్‌బాషా, మహబూబ్‌సాబ్, తిప్పేస్వామితో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పత్తి రైతులను ఆదుకోవాలి



రాస్తారోకో చేస్తున్న రైతు సంఘం నాయకులు

**పెద్దవడుగూరు, ఫిబ్రవరి10:** మండలంలో పత్తిని సాగుచేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు శనివారం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దస్తగిరి మాట్లాడుతూ జిల్లాలో రెండేళ్లుగా పత్తి సాగు విస్తీర్ణం బాగా పెరిగిందన్నారు. గత ఖరీఫ్‌లో సుమారు 80వేల ఎకరాల్లో పత్తి సాగు చేయగా సకాలంలో వర్షాలు పడకపోవడంతో దిగుబడి తగ్గిందన్నారు. మద్దతుధర కూడా ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఇదే అదునుగా దళారులు రూ.5వేల నుంచి రూ. 6వేలకే పత్తిని కొనుగోలు చేయడంతో రైతులకు గిట్టుబాటు కాక నష్టపోతున్నారన్నారు. ప్రస్తుతం ఉన్న మద్దతు ధర రూ.7020కు అదనంగా మరో 2వేలు బోనస్ ప్రకటించి పత్తిని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు నాగరాజు, నాగేశ్వర, వెంకటరామిరెడ్డి, ముని, సాంబశివుడు, వీరాంజినేయులు, రామిరెడ్డి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక



టీడీపీ చేరిన వారితో పయ్యావుల శ్రీనివాసులు

**కూడేరు, ఫిబ్రవరి 10:** మండలంలోని చోళ సముద్రం గ్రామానికి చెందిన పది దళిత కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. జిల్లా కేంద్రంలో శనివారం పయ్యావుల శ్రీనివాసుల సమక్షంలో వీరు టీడీపీలో చేరారు. ముత్యాలప్ప, ఈశ్వరయ్య, లక్ష్మీదేవి, పెద్దన్న, డేవిడ్, రాజమ్మ, ఎర్రమ్మ, పెద్దక్క, బాలు, మధు, ముత్యాలప్ప, వంశీ, లింగన్న, జయప్ప, రాములమ్మ, తదితరులకు పయ్యావుల శ్రీనివాసులు కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు.

**బెళుగుప్ప:** మండలంలోని యలగలవంకతండాకు చెందిన 20 వైసీపీకి చెందిన కుటుంబాలు టీడీపీలో చేరాయి. వినోద్ నాయక్, సోని నాయక్, ఉమేష్ నాయక్, నటరాజ్ నాయక్, పవన్‌కుమార్, శీన నాయక్, లక్ష్మన్న నాయక్, రాజశేఖర్ నాయక్, సాయి కుమార్, పురుషోత్తమ్, లక్ష్మీ నాయక్ తదితరులు అనంతపురంలో ఎమ్మెల్యే స్వగృహంలో టీడీపీ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. వైసీపీ ప్రభుత్వ విధానాలు నచ్చక పయ్యావుల సోదరులు చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరామని యువకులు తెలిపారు.

**ఉరవకొండ:** మండలంలోని నెరమెట్ల గ్రామానికి చెందిన వైసీపీ క్రియాశీలక నాయకుడు శ్రీధర్‌రెడ్డి శనివారం టీడీపీలో చేరారు. టీడీపీ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు ఆయనకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మరో 10 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, వ్యాసాపురం సర్పంచు సీతారాం, టీడీపీ నాయకులు గోవిందు, వన్నారెడ్డి, జగన్నాథ్, వన్నూరుస్వామి, పర్వత రెడ్డి పాల్గొన్నారు.

## తూనికలు, కొలతల్లో వ్యత్యాసాలుంటే చర్యలు

**బెళుగుప్ప, ఫిబ్రవరి 10:** తూనికలు, కొలతల్లో వ్యత్యాసాలుంటే కఠిన చర్యలు తప్పవని లీగల్ మెట్రాలజి ఇన్‌స్పెక్టర్ శంకర్ హెచ్చరించారు. మండల కేంద్రంలో శనివారం ఆయన తూనికలు, కొలతలు పరికరాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది షంషేర్, రమేష్ పాల్గొన్నారు.

## కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం

**బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 10:** మండలంలోని ఎరడికెర చెక్‌పోస్టు వద్ద 288 కర్ణాటక మద్యం ప్యాకెట్లు, ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ చెక్‌పోస్టు వద్ద శనివారం తనిఖీ చేస్తుండగా ఎరడికెరకు చెందిన వీరదాసు, మల్లేశిలు కర్ణాటక మద్యాన్ని ద్విచక్రవాహనం పై జిల్లాలోకి తీసుకుని వస్తుండగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## వివాహిత ఆత్మహత్యాయత్నం

**కళ్యాణదుర్గంరూరల్ ఫిబ్రవరి 10:** మండలంలోని పీటీఆర్ ఎగువపల్లి తండాకు చెందిన వివాహిత ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు తెలిపిన మేరకు మూడే కవిత బాయి గత రెండేళ్ల నుంచి కడుపునొప్పితో బాధపడుతుండేదన్నారు. ఈక్రమంలోనే కడుపు నొప్పి భరించలేక శనివారం సాయంత్రం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిపారు.

## బస్టాండులో మౌలిక వసతులు కల్పించాలి

**గుత్తి, ఫిబ్రవరి 10:** పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు మౌలిక వసతులను కల్పించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి పేర్కొన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు. బస్టాండ్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండ్‌లో మరుగుదొడ్లు, మూత్రశాలలు అధ్వానంగా ఉన్నాయన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆర్టీసీ అధికారి రమణమ్మతో చర్చించామన్నారు. ఆమె నిర్లక్ష్యంగా సమాధానం చెప్పిందని వారు వాపోయారు. కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటరాముడు, మండల కార్యదర్శి రామదాసు, నాయకులు రాజు, రమేష్, మధు, నరసింహయ్య, నజీర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## దుస్తుల దుకాణం సీజ్

**గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 10:** పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పెట్రోల్‌బంక్ పక్కన ఉన్న ఓ దుస్తుల దుకాణాన్ని మున్సిపల్ అధికారులు శనివారం సీజ్ చేశారు. అధికారులు తెలిపిన మేరకు తమిళనాడుకు చెందిన ఓ వ్యాపారి పెట్రోల్ బంక్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో 8నెలల క్రితం రేకుల షెడ్ వేసుకొని దుస్తుల దుకాణాన్ని ప్రారంభించాడు. ధరలు తక్కువగా ఉండటంతో వ్యాపారం బాగా పుంచుకుంది. దీంతో తమకు నష్టం కలుగుతోందని పట్టణంలోని మర్చంట్ అసోసియేషన్ సభ్యులు ప్రజాప్రతినిధి దృష్టికి తీసుకెళ్లారు. షెడ్ నిర్మాణానికి మున్సిపాలిటీ అనుమతి తీసుకోలేదని, దుస్తులు విక్రయించేందుకు ట్రేడ్ లైసెన్స్ తీసుకోకుండా షాపు నిర్వహిస్తున్నాడని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య, ఏఎస్ఐ, ఐదుగురు కానిస్టేబుళ్లు, మున్సిపల్ టీపీఎస్ సత్తార్, ఇన్‌స్పెక్టర్ మురళి, టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులు, వీఆర్వోలు షాపు వద్ద చేరుకున్నారు. షాపులో ఉన్న దుస్తులను వీడియో తీయించారు. పంచనామ చేసి మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బందితో ప్యాక్ చేయించారు. షాపును సీజ్ చేస్తామని పోలీసులు, మున్సిపల్ అధికారులు తెలిపారు.